# గోరంట్ల కొండమీద రిజర్వాయర్ పనులు వేగవంతం

## --నగర కమీషనర్ కీర్తి చేకూరి

**గుంటూరు నగరపాలక సంస్థ, అక్టోబర్ 14, ప్రభాతవార్త :** విలీన గ్రామాలకు సంవృద్ధిగా తాగునీరు అందించే గోరంట్ల కొండమీద రిజర్వాయర్ పనులు వేగవంతం



కావాలని,పనులు పురోగతి పై ప్రతిరోజు నివేదిక ఇవ్వాలని నగర కమీషనర్ కీర్తి చేకూరి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.కమీషనర్ గోరంట్ల కొండమీద నిర్మాణంలో ఉన్న రిజర్వాయర్ పైప్‌లైన్ పనులను కాకానిరోడ్డు రిలయన్స్ పెట్రోల్ బంక్,గడ్డిపాడు రైల్వే గేటు క్రాసింగ్,గోరంట్లలో ఇంజనీరింగ్ అధికారులు,కాంట్రాక్టర్లతో కలసి పరిశీలించి పనుల వేగవంతంపై తగుఆదేశాలు జారీ చేశారు.గడ్డిపాడు రైల్వే లైన్ క్రాసింగ్‌కు రైల్వే శాఖనుండి అనుమతులు వచ్చినందున పనులు వేగవంతంపై దృష్టి సారించాలన్నారు.కాకాని రోడ్డు రిలయన్స్ పెట్రోల్ బంక్ నుండి పైప్‌లైన్ పనులు 2రోజుల్లో రైల్వే లైన్ వరకు రావాలన్నారు.కాంట్రాక్టర్ పనులు జాప్యం చేయకుండా ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని,ఏ సమస్య ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.పర్యటనలో ఎస్ఈ భాస్కర్,ఈఈ శాంతిరాజు,డిఈఈ హానిఫ్,ఏఈ రాము,సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో వార్డు సచివాలయం అడ్మిన్

## - రూ.4వేలు లంచం డిమాండ్

**గుంటూరు క్రైం, అక్టోబరు 14, ప్రభాతవార్త:**



రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటుచేసిన సచివాలయం వ్యవస్థలో కూడా లంచాల భాగవతం మొదలైనది. అందరితో పాటుగా మేము సైతం అంటూ కొందరు ఉద్యోగులు తాము చేసే పనికి లంచాన్ని డిమాండ్ చేయడం గమనార్హం. అలా లంచం డిమాండ్ చేసిన ఒక సచివాలయం ఉద్యోగి ఏసీబీ వలలో పడ్డాడు. గుంటూరు నగరంలోని ఏటి అగ్రహారం 89వ వార్డు సచివాలయం అడ్మిన్ షేక్ ఆరిఫ్ లంచం తీసుకొంటూ దొరికిపోయాడు. మిర్చియార్డు ప్రాంతానికి చెందిన ఎం.నాగభూషణం అనే వ్యక్తి అపార్ట్‌మెంట్ కొనుగోలు చేశాడు. ఇటీవల రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారు. ఆన్‌లైన్‌లో పేరు మార్పుకు తన పరిధిలోని సచివాలయంకు వెళ్లాడు. అక్కడ అడ్మిన్‌గా ఉన్న ఆరిఫ్ పేరు మార్చడం కోసం రూ.6వేలు డిమాండ్ చేశాడు. నేను చిరుద్యోగిని అంత ఇచ్చుకోలేనని బ్రతిమలాడగా రూ.4వేలకు అతను ఒప్పుకున్నాడు. ఈ విషయాన్ని నాగభూషణం ఏసీబీ అధికారులకు చెప్పడంతో ఆశాఖ ఏఎస్పీ జొన్న వెంకట్రావు ఆధ్వర్యంలో శుక్రవారం వలపన్నారు. ముందస్తు పథకంలో భాగంగా నాగభూషణం సచివాలయంలోకి వెళ్లి రూ.4వేలను అతనికి అందించడంతో అక్కడే మాటువేసి ఉన్న అధికారులు ఆరిఫ్‌ను వెంటనే అదుపులోకి తీసుకున్నారు. దాడిలో డీఎస్పీ శరత్‌బాబు, సీఐలు నాగరాజు, బి.రవిబాబు, సురేష్, మన్మధరావు, అంజిబాబుతో పాటుగా ఎస్సై శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు. ముద్దాయిని శనివారం విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# పాఠశాలలకు టెన్త్ ఓరిజినల్ మార్కుల జాబితాలు

**గుంటూరు విద్య, అక్టోబర్ 14, ప్రభాతవార్త :**

రాష్ట్ర పరీక్షల విభాగం కార్యాలయం నుంచి పదో తరగతి విద్యార్థుల ఓరిజినల్ మార్కుల జాబితాలను పాఠశాలలకు పంపారు.ఈ మేరకు రాష్ట్ర పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డి ఉత్తర్వులు జారీచేశారు.ఏప్రిల్ 2022,జూలై 2022 పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసి ఉత్తీర్ణత చెందిన విద్యార్థుల ఒరిజినల్ మార్కుల జాబితాలను అందజేసేటప్పుడు పాటించాల్సిన నిబంధనలను ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# ఏఎన్‌యు వీసికి లక్ష్మీపార్వతి శుభాకాంక్షలు

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,అక్టోబరు14, ప్రభాతవార్త:**

వీసిగా పూర్తి బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ పి.రాజశేఖర్‌ను తెలుగు అకాడమీ ఛైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి అభినందించారు. వీసిగా నియమితులైనందుకు శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజాభివృద్ధిలో



యూనివర్సిటీల పాత్ర చాలా ఉంటుందని, మీలాంటి వీసి సమాజానికి, విద్యారంగానికి చాలా అవసరమని పేర్కొన్నారు. యూనివర్సిటీ అభివృద్ధిలో, పాలనాపరమైన పదవుల్లో మహిళలకు ఇస్తున్న ప్రాధాన్యం ఇతరులకు మార్గదర్శకులుగా నిలుస్తారని ప్రశంసించారు. ఈ సందర్భంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బండి కరుణ, ప్రిన్సిపాల్స్ సిద్దయ్య, శ్రీనివాసరెడ్డి, దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ డా॥ బట్టు నాగరాజు, పీజీ పరీక్షల కోఆర్డినేటర్ ఉదయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ సంధ్యాకోల్

## - నూతన కోఆర్డినేటర్లను నియమించిన వీసి

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,అక్టోబరు14, ప్రభాతవార్త:** వీసిగా పూర్తి బాధ్యతలు తీసుకున్న తర్వాత ప్రొఫెసర్ రాజశేఖర్ తన మార్కు పాలనను చూపిస్తున్నారు. పాలనలో వేగవంతంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. గత కొంత కాలంగా ఖాళీగా ఉన్న పలు పదవుల్లో కొత్త వారికి అవకాశం కల్పించారు. యూనివర్సిటీ పాలనాపరమైన పదవుల్లో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయి. కొన్ని పదవులకు నూతన కోఆర్డినేటర్‌లు నియమితులుకాగా, మరికొన్ని పదవుల్లో పాతవారు కొనసాగనున్నారు. ఈమేరకు వీసి ప్రొఫెసర్ రాజశేఖర్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య బండి కరుణ ఉత్తర్వులు జారీచేశారు. యూజి పరీక్షల కోఆర్డినేటర్‌గా



వీసి నుంచి నియామకపత్రం అందుకుంటున్న సంధ్యాకోల్

ప్రొఫెసర్ సంధ్యాకోల్, రీసెర్చ్‌సెల్ కోఆర్డినేటర్‌గా డా॥పి.కిరణ్మయి, బాలికల వసతిగృహాల్ ఛీఫ్ వార్డెన్‌గా ప్రొఫెసర్ వి.వెంకటరత్నమ్మలు నియమితులయ్యారు. ఇక మిగిలిన పదవుల్లో దూరవిద్యా కేంద్రం డైరెక్టర్‌గా డా॥బట్టు నాగరాజు, పరీక్షల కోఆర్డినేటర్‌గా డా॥కె.సోమశేఖర్, సి.డిసి డీన్‌గా ప్రొఫెసర్ కె. మధుబాబు, ఇంటర్నేషనల్ స్టూడెంట్ సెల్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ జి.చెన్నారెడ్డి, ఎన్.ఎస్.ఎస్ సెల్ కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ ఎం.రవిశేఖర్, పీజీ అడ్మిషన్ల డైరెక్టర్‌గా ప్రొఫెసర్ బి.హరిబాబు, పీజీ పరీక్షల కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ ఉదయకుమార్, రూసా కోఆర్డినేటర్‌తో పాటుగా ఓఎస్‌డిగా ప్రొఫెసర్ కె.సునీతలు కొనసాగనున్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు కోఆర్డినేటర్‌లుగా వీరు ఆయా పదవుల్లో బాధ్యతలు నిర్వహిస్తారు.

గుంటూరు వార్త

# ఆరోగ్య పరిరక్షణపై అవగాహన

**గుంటూరు విద్య, అక్టోబర్ 14, ప్రభాతవార్త :**

ఆవిష్కరణ ఆధారిత,గ్లోబల్ ఫార్మాస్యూటికల్,గ్లెన్‌మార్క్ పార్మాస్యూటికల్స్ లిమిటెడ్,ప్రపంచ హృదయ మాసాన్ని దృష్టిలో పెట్టుకొని ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు సంస్థ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు.దీనిలో భాగంగా 300హైపర్ టెన్షన్ ప్రజా అవగాహన ర్యాలీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.8వేలకు పైగా హైపర్ టెన్షన్ స్క్రీనింగ్ క్యాంప్‌లను దేశవ్యాప్తంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు.ఈ కంపెనీ ఈ ర్యాలీలను దేశవ్యాప్తంగా పలు హాస్పటల్స్‌తో భాగస్వామ్యం చేసుకొని నిర్వహించినట్లు గ్లెన్‌మార్క్ గ్రూప్ వైస్ ప్రెసిడెంట్,హెడ్ ఆఫ్ ఇండియా ఫార్ములేషన్స్ అలోక్ మాలిక్ తెలిపారు.

# రాష్ట్రంలో మానవ హక్కుల ఉల్లంఘనకు ప్రభుత్వం ఊతమిస్తుంది

**గుంటూరు అర్బన్, అక్టోబర్ 14, ప్రభాతవార్త :**

రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని,మానవ హక్కుల ఉల్లంఘనకు అసమర్ధ వైకాపా ప్రభుత్వం ఊతమిచ్చే తెదేపా శ్రేణులపై అక్రమ కేసులు బనాయిస్తుంది.తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు,మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు విమర్శించారు.ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెదేపా రాష్ట్ర మీడియా ఇన్‌చార్జ్ దారపనేని నరేంద్రను సిఐడి పోలీసులు

-మీడియాతోపాటు సామాన్యులకు రక్షణ కరువు

-వైకాపా ప్రభుత్వానికి పతనం మొదలైంది.

-అక్రమ అరెస్టులపై సీఎం,డిజిపి సమాధానం చెప్పాలి

-గుంటూరులో తెదేపా అధినేత చంద్రబాబు ఫైర్

అరెస్టుచేయగా గురువారం అర్ధరాత్రి న్యాయమూర్తి ఆదేశాలతో జామీనుపై నరేంద్రను విడుదల చేశారు.ఈ క్రమంలో తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు శుక్రవారం స్థానిక అరండల్‌పేటలో నివాసముంటున్న నరేంద్రను పరామర్శించి,తెదేపా అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు.అనంతరం విలేఖరులతో ఆయన మాట్లాడుతూ నరేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వాట్సాప్ గ్రూప్‌లో పోస్టులు పెట్టాడని సిఐడి పోలీసులు కిడ్నాప్ చేసి చిత్రహింసలకు గురిచేయడం దుర్మార్గమన్నారు.తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడిచేసినవారిని ఇప్పటివరకు అరెస్టు చేయలేని పోలీసులు తమ నాయకుడ్ని భయభ్రాంతులకు గురిచేసేందుకు అరెస్టు చేసి చిత్రహింసలకు గురిచేశారని దారుణమన్నారు.కొందరు పోలీసు అధికారులు అధికార పార్టీకి తాబేదారుల్లా వ్యవహరిస్తూ రాజ్యాంగానికి వ్యతిరేకంగా పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.సీఎం జగన్‌రెడ్డి ఉన్నాడన్న ధీమాతో సిబి సిఐడి పోలీసు అధికారులు రెచ్చిపోతూ చట్టానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ఆరోపించారు.అక్రమ అరెస్టులపై సీఎం,డిజిపి ప్రజలకు సమాధానం చెప్పాల్సి మండిపడ్డారు.తాము అధికారంలో ఉన్న సమయంలో పోలీసుల్ని ప్రజల రక్షణకు వినియోగించామని కానీ ప్రతిపక్షాలపై ఉసిగొల్పలేదన్నారు.ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు వైకాపాకు కొమ్ముకాసేలా వ్యవహరించడం ఉంటుందన్నారు.ప్రజాక్షేత్రంలో వీళ్ళని దోషులుగా నిలబెడతామని హెచ్చరించారు.రాష్ట్రంలో సామాన్యులతో పాటుగా మీడియాకు సైతం రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తంచేశారు.మరో ఏడాదిలో వైకాపా ప్రభుత్వం పతనమై సీఎం జగన్మోహనరెడ్డి ఇంటికి వెళ్ళడం ఖాయమని జోస్యం చెప్పారు.రానున్న ఎన్నికల్లో వైకాపాను గద్దె దింపేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ నసీర్ అహ్మద్, పశ్చిమ ఇన్‌చార్జ్ కోవెలమూడి రవీంద్ర,గుంటూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్, పెద్దఎత్తున తెదేపా శ్రేణులు పాల్గొన్నారు.



టిడిపి మీడియా ఇన్‌చార్జ్ నరేంద్రను గుంటూరులోని ఆయన నివాసంలో పరామర్శిస్తున్న తెదేపా అధినేత చంద్రబాబు

# జాతీయ స్థాయి "ఈబైక్ డిజైన్" పోటీల్లో ఆర్‌విఆర్ జేసి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

**గుంటూరు విద్య, అక్టోబర్ 14, ప్రభాతవార్త :**

జాతీయస్థాయిలో ఆర్‌విఆర్ అండ్ జేసి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు ఈ బైక్ డిజైన్ పోటీల్లో గుర్తింపు రావడం తమకెంతో ఆనందదాయకమని ఆర్‌విఆర్ జేసి ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన ఆ వివరాలను వివరిస్తూ ఇటీవల కొయంబత్తూర్‌లోని శ్రీ రామకృష్ణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో మెకట్రాన్ మోటార్స్ ఆధ్వర్యంలో "నేషనల్ లెవల్ ఈ బైక్ డిజైన్ ఛాలంజ్" పేరుతో నిర్వహించిన పోటీల్లో దేశం నలుమూలల నుంచి



ఈబైక్ డిజైన్ పోటీల్లో అవార్డులు పొందిన ఆర్‌విఆర్ జేసి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు

విద్యార్థులు తమ మేధాశక్తితో తయారు చేయబడిన వివిధ రకాల ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలను ప్రదర్శించారని తెలిపారు.ఈ ప్రదర్శనలో పోటీ నిర్వహకులు విద్యార్థులు తయారు చేసిన ఈ బైక్ తయారీ విధానాన్ని,వాటి పనితీరును,అందుక ఉపయోగించిన పరికరాలను పరిశీలించి అందులో అత్యుత్తమ డిజైన్‌తో రూపొందించబడిన ఈ బైక్‌లను తయారు చేసిన విద్యార్థులను విజేతలుగా ప్రకటించి ప్రోత్సాహక నగదుబహుమతులు,మెమోంటో,సర్టిఫికేట్‌లను ప్రధానం చేశారని తెలిపారు.ఈ పోటీల్లో ఆర్‌విఆర్ జేసి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు తయారు చేసిన ఈబైక్‌కు ఓవరాల్ స్టిక్ విన్నర్,బెస్ట్ ఇన్నోవేషన్ ప్రైజ్,ఫెయిర్ ప్లే మొత్తం మూడు అవార్డులు లభించాయని తెలిపారు.ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం,అధ్యాపక బృందం ఆయా విద్యార్థులను అభినందించారు.ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ప్రయోగాత్మకంగా విజయాలు సాధించేందుకు నిరంతరం పరిశోధనలు చేయాలన్నారు.విద్యార్థులను అభినందించిన వారిలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్,డైరెక్టర్ ఫైనాన్స్,అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు,ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి డాక్టర్ కె.చంద్రశేఖర్,ఈసీ విభాగాధిపతి డాక్టర్ టి.రంగబాబు,కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ ఐటిటి విభాగాధిపతి డాక్టర్ నాగమల్లేశ్వరరావు తదితరులు ఉన్నారు.

# యార్డుకు 30వేలకు పైగా మిర్చిబస్తాల రాక

**గుంటూరు,అక్టోబర్ 14,ప్రభాతవార్త :**

గుంటూరు మిర్చియార్డుకు వివిధ ప్రదేశాల నుంచి 30,445 బస్తాల మిర్చి శుక్రవారం అమ్మకానికి యార్డుకు వచ్చాయి.వీటిలో 33,882 బస్తాల మిర్చి అమ్మకాలు జరిగాయి.ఇంకా 6,810 బస్తాల మిర్చి నిల్వఉంది.కామన్ వెరైటీ 334 రకం రూ.8,800నుంచి 24,800వరకు,ఐదవ నంబర్ రకం రూ.12,000నుంచి 24,400 వరకు, 273 నంబర్ రకం రూ.9,000 నుంచి రూ.17,000 వరకు, 341 నంబర్ రకం రూ.12,500 నుంచి 26,000 వరకు, తేజ రకం రూ.7,500నుంచి రూ.23,000వరకు, బాడిగి రూ.10,000 నుంచి 27,000వరకు,తాలురకం రూ.5,000 నుంచి రూ.13,500 వరకు ధరపలికింది.

# 16న తెలుగువీర లేవరా స్మృత్యంకిత సభ

**గుంటూరు కల్చరల్, అక్టోబర్ 14, ప్రభాతవార్త :**

1857 నుంచి 1947 స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న 116మంది తెలుగు కవులు,సాహిత్యకారులు,స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రలను మూడు సంపుటాలుగా వెలువరించిన పుస్తకాలు..."తెలుగు వీర లేవరా స్మృత్యంకిత" సభ ద్వారా ఈనెల 16వ తేది ఆదివారం ఉదయం 10గంటలకు శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం పద్మావతి కళ్యాణ వేదికపై ప్రముఖుల చేత ఆవిష్కరిస్తున్నట్లు చెన్నపురి తెలుగు అకాడమీ అధ్యక్ష కార్యదర్శులు తిరునగరి భాస్కర్ డాక్టర్ సంజీవరావులు పేర్కొన్నారు.అచార్య జి.కోటేశ్వరరావు అధ్యక్షత వహించే ఈ సభలో తెలుగు వీర లేవరా ప్రథమ సంపుటి ఆచార్య ఎన్జీరంగా స్మృత్యంకితాన్ని మాజీమంత్రి,ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్,రెండవ సంపుటి మాజీ ప్రధాని పివి నరసింహారావు స్మృత్యంకితాన్ని ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం,తృతీయ సంపుటి మోటూరి సత్యనారాయణ స్మృత్యంకితాన్ని సిబిఐ మాజీ డైరెక్టర్ వివి లక్ష్మీనారాయణ చేతుల మీదుగా ఆవిష్కరిస్తారని చెప్పారు.నగరంలోని సాహిత్య అభిమానులు సీనియర్ సిటిజెన్లు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా భాస్కర్,సంజీవరావులు తెలియజేశారు.

# ప్రజాస్వామ్యమంటే ఎన్నికల్లో మెజార్టీ సాధించడంకాదు

**గుంటూరు కల్చరల్, అక్టోబర్ 14, ప్రభాతవార్త :**

ప్రజాస్వామ్యమంటే ఎన్నికల్లో మెజార్టీ సాధించడంకాదనే విషయం అందరూ తెలుసుకోవాలని ఈ మెజార్టీయన్ విధానంలో నడుస్తుంది వ్యక్తిస్వామ్యం,ముఠాస్వామ్యం లేక మూకస్వామ్యం మాత్రమేనని అవగాహన సంస్థ నిర్వహించిన చర్చాగోష్టిలో పాల్గొన్న విశ్లేషకులు,మేధావులు అభిప్రాయపడ్డారు.శుక్రవారం అవగాహన సంస్థ కార్యాలయంలో నిజమైన ప్రజాస్వామ్యం-భారత్‌లో ఉందా? అన్న అంశంపై చర్చ జరిగింది.చర్చా కార్యక్రమాన్ని విద్యావేత్త,విశ్లేషకులు చంద్రయ్య ప్రారంభిస్తూ ఓటర్ల సంఖ్య బట్టి భారతదేశం ఈ ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా గొప్పగా చెప్పుకోవడానికే ఉపయోగపడుతుందని నిజానికి భారత్‌లో ప్రజాస్వామ్యం జాడలేదన్నారు.

వినియోగదార్ల సంఘం నాయకులు కె.సాంబయ్య మాట్లాడుతూ రాజకీయ పార్టీల అధికారం కోసం రాజకీయాన్ని వ్యాపారంగా మార్చేశాయన్నారు.చర్చలో కోటేశ్వరరావు,సుబ్బారెడ్డి,తదితరులు ప్రసంగించారు.

# సిఐడి పోలీసులకు దెబ్బ మీద దెబ్బ

**గుంటూరు లీగల్, అక్టోబర్ 14, ప్రభాతవార్త :** గత కొంతకాలంగా సోషల్ మీడియా పోస్టులపై చూపెడుతున్న అరెస్టులలో,రిమాండ్లను సిఐడి న్యాయస్థానం మేజిస్ట్రేట్ తిరస్కరిస్తుండటంతో దెబ్బ మీద దెబ్బ,ఎదురు దెబ్బలుగా సిఐడి పరిస్థితి తయారైంది.బుధవారం అరెస్టుఅయిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మీడియా సమన్వయకర్త దారపనేని నరేంద్రబాబును విడుదల చేయాలని సిఐడి న్యాయస్థానం మేజిస్ట్రేట్ కొల్లి శ్రుతవింద ఆదేశించారు.గురువారం రాత్రి సిఐడి పోలీసులు నరేంద్రను మేజిస్ట్రేట్ గృహంలో రిమాండ్‌కై హాజరుపరచగా,ఆయన ఆరోపణలపై వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.దీంతో రాత్రి 9.30గంటల ప్రాంతంలో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి నరేంద్రను తరలించగా,నిపుణుల కమిటీ వైద్యపరీక్షలు నిర్వహించింది.నలుగురు వైద్యనిపుణుల ఆధ్వర్యంలో నరేంద్రను పరీక్షించి నివేదిక రూపొందించారు.ఆ నివేదికను సీల్డ్ కవర్లో సిఐడి అధికారులకు అందజేశారు.వైద్యుల నివేదిక తీసుకున్న సిఐడి అధికారులు,తెల్లవారుజామున రెండుగంటల సమయంలో నరేంద్రను తిరిగి న్యాయమూర్తి శ్రుతవింద ఎదుట ప్రవేశపెట్టారు.నరేంద్రను రిమాండ్‌కు తరలించేలా ఆదేశాలు ఇవ్వాలని సిఐడి అధికారుల విజ్ఞప్తిని న్యాయమూర్తి తిరస్కరించారు.నరేంద్రపై నమోదైన కేసులో అన్నీ బెయిలబుల్ సెక్షన్లు కాబట్టి రిమాండ్ అవసరం లేదని అభిప్రాయపడ్డారు.25వేల రూపాయల సొంత పూచికత్తుతో నరేంద్రను విడుదల చేయాలని ఆదేశించారు.దీంతో నరేంద్ర సిఐడి కస్టడి నుంచి విడుదలయ్యారు.అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ,సిఐడి అధికారులు తనను ఇబ్బంది పెట్టిన తీరుపై ఆవేదన వెలిబుచ్చారు.నరేంద్ర అరెస్టు అక్రమం కాబట్టే ఆయనను విడుదల చేశారని న్యాయవాదులు తెలిపారు.నరేంద్రకు తెదేపా పొలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనంద్‌బాబు,ఇతర తెదేపానాయకులు స్వాగతం పలికారు.సిఐడి చీఫ్ సునిల్‌కుమార్ వ్యవహార శైలిపై నక్కా ఆనంద్‌బాబు అభ్యంతరం వ్యక్తంచేశారు.ప్రభుత్వ కుట్రల్ని చట్టపరంగా ఎదుర్కొంటామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు

**--నరేంద్రను పరామర్శించిన చంద్రబాబు**

తెలుగుదేశం పార్టీ కోసం నిబద్ధతతో పనిచేస్తున్న దారపనేని నరేంద్రబాబును చిత్రహింసలు పెట్టడం సిఐడి పోలీసుల దిగజారుడు తనానికి నిదర్శనమని రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.సోషల్ మీడియా పోస్టుల వ్యవహారంలో సిఐడి పోలీసులు అరెస్టుచేసిన తెదేపా పార్టీ మీడియా సమన్వకర్త నరేంద్రబాబుని పరామర్శించేందుకు శుక్రవారం సాయంత్రం స్థానిక అరండల్‌పేటలోని ఆయన నివాసానికి వచ్చారు.పార్టీ,నరేంద్ర కుటుంబానికి పూర్తి అండగా ఉంటుందని ప్రభుత్వ చర్యలకు భయపడాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు.

# పేదల జీవనశైలిలో మార్పుకోసమే పథకాలు అమలు

**-ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య**

**పొన్నూరు, అక్టోబరు 14,ప్రభాతవార్త:** సమాజంలో నూటికి 85శాతం వున్న పేదల ప్రజల జీవనశైలిలో మార్పుకోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. నిడుబ్రోలు 14,15వ వార్డుల్లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదలు కూడా ఆర్థికంగా బలోపేతం కావాలన్నదే ప్రభుత ్వ ఉద్దేశమన్నారు. నేను విన్నాను, నేడు ఉన్నాను అని మాట ఇచ్చిన



కిలారి దళం సాంగ్ సీడీని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

జగన్మోహనరెడ్డి వాటిని పక్కాగా అమలు చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటికై ఇచ్చిన హామీలలో 95శాతం పూర్తి చేశారన్నారు. గత ప్రభుత్వాలు చాలా తక్కువ మందికి మాత్రమే పథకాలను అందజేసి ప్రచార ఆర్భాటాలు చేసుకొన్నారన్నారు. అయితే ఈ ప్రభుత్వం ప్రచారానికి దూరంగా ఉంటూ పాదర్శకతకు పెద్ద పీట వేస్తుందన్నారు. విద్య, వ్యవసాయ, వైద్య రంగాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అర్హులు ఇంకెవరైనా ఉంటే వారికి కూడా సంక్షేమ పథకాలు అందించాలన్న ఉద్దేశంతోనే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే కిలారి ఇంటింటికి తిరిగి ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించి అందుకు సంబంధించిన పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ డాక్టర్ నలమలపు రాధ, మునిసిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ యక్కటి హనుమాన్ ప్రసాద్, అర్బన్ సిఐ మాతంగి బాబి, నాయకులు మల్లెల రాజు, మంద్రు అనిత, దేవరకొండ గోపి, ఆకుల వెంకటేశ్వరరావు, నన్నపనేని వీరయ్యచౌదరి, బొనిగల రాజారావు, భవనం వంశీరెడ్డి,యందేటి వెంకటసుబ్బయ్య, అమిరినేని సాంబశివరావు, షేక్ సైఫుల్లా, వట్టిప్రోలు రంగారావు, అంబటి వెంకటేశ్వరరావు,యామని శ్రీహరి, యర్రంశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని పాఠశాలల్లో పరిశుభ్రత పాటించాలి

**పొన్నూరు, అక్టోబరు 14,ప్రభాతవార్త:** అన్ని పాఠశాలల్లో పరిశుభ్రత పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి రుద్రపాటి శోభాచంద్ ఆదేశించారు.



స్థానిక విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం మండలంలోని మండల ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత, మునిసిపల్ పాఠశాలలకు టిఎంఎఫ్(టాయిలెట్ మెయింటెన్స్ ఫండ్)ద్వారా 84పాఠశాలలకు మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా రుద్రపాటి శోభాచంద్ మాట్లాడుతూ మెటీరియల్‌ను ఉపాధ్యాయులు జాగ్రత్త వాడి టాయిలెట్స్‌ను శుభ్రంగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు సేఫ్టీ జాకెట్ ్స, స్ప్రే బాటిల్స్, బాత్రూమ్ వైపర్స్ తదితర సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రాజధాని ప్రాంతంలో బిజేపి రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు పర్యటన

**మంగళగిరి, అక్టోబర్ 14, ప్రభాతవార్త :** రాజధాని ప్రాంతంలోని కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎయిమ్స్ ఆస్పత్రి విట్,ఎస్ఆర్ఎం,అమృత యూనివర్సిటీలకు వెళ్ళు మార్గాలలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను శుక్రవారం బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు పరిశీలించారు.అంతర్జాతీయ ప్రమాణాలతో ఉన్న విద్యాసంస్థలకు రహదారి నిర్మాణం కూడా చేయకపోవడంపై రాష్ట్ర ప్రభుత్వం పై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు మండిపడ్డారు.ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ ..ప్రతిష్టాత్మకంగా విద్యాసంస్థలకు వెళ్ళే మార్గాల్లో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం జగన్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర ్శనమని



విమర్శించారు.అమరావతి లో అభివృద్ధి ఆపేసి...ఎడారిగా మార్చారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు.రాజధాని గ్రామాల్లో అమృత,విట్,ఎస్ఆర్ఎం యూనివర్సిటీలు ఉన్నాయి.దేశవ్యాప ్తంగా పేరు గాంచిన ఈ యూనివర్సిటీలలో అనేక రాష్ట్రాలు,దేశాల నుంచి విద్యార్థులు ఇక్కడకు వచ్చి చదువుతున్నారని అన్నారు.పదకొండ కిలోమీటర్లు ఉన్న రోడ్డును డబుల్ లైన్‌గా అభివృద్ధి చేయాలన్నారు.వైసీపీ ప్రభుత్వం యూనివర్సిటీ వాళ్ళపై కూడా కక్ష పూరితంగా వ్యవహరిస్తుందని నా దృష్టికి వచ్చిందని చెప్పారు.ఇటువంటి చర్యలు వేంటనే నిలిపివేయాలని రెండు కోట్లు వ్యయం అయ్యే రోడ్ల పనులు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు.ఈ యూనివర్సిటీకి వచ్చే ఒక్క రోడ్డు కూడా బాగోలేదు.అన్నీ తెలిసినా జగన్ మొద్దునిద్ర పోతున్నాడు.ఇక్కడే రాజధాని అని అధికారంలోనికి వచ్చి మాట తపి ్ప,మడమ తిప్పాడని విమరి ్శంచారు.అమరావతి రైతులు యాత్ర చేస్తుంటే కుట్ర చేసా ్తరా...బిజేపి రైతుల ఉద్యమానికి అండగా ఉంటుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పాటిబండ్ల రామకృష ్ణ,బిజేపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్ర శివన్నారాయణ రాష్ట్ర కార్యదర్శి మాగంటి సుధాకర్ యాదవ్,రాష్ట ్ర అధికార ప్రతినిధి చందు సాంబశివరావు,జగ్గారపు శ్రీనివాసరావు,అందే శివశంకరరావు,పంచుమర్తి ప్రసాద్,ఆకురాతి నాగేంద్రం,తులిమిల్లి శ్రీనివాసరావు,బిజేపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటినుంచి చెత్తను సేకరించాలి

**: కమీషనర్ గోవిందరావు**

**చిలకలూరిపేట,అక్టోబరు14,ప్రభాతవార్త:** పట్టణంలో క్లాప్ ప్రోగ్రాంలో భాగంగా ప్రతి ఇంటినుంచి చెత్తను సేకరించాలని, అదేవిదంగా చెత్తపన్నును కూడా వసూలు చేయాలని మున్సిపల్ కమీషనర్ చుక్కల గోవిందరావు సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ సిబ్బంది, వార్డు కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ఆదేశాలమేరకు మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని ఆధ్వర్యంలో పట్టణంలోని అన్ని వార్డులలో ప్రత్యేక శానిటేషన్ కార్య క్రమాలను నిర్వహిస్తున్నామని కమీషనర్ తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం



కావున ప్రతిరోజు మురుగుకాలువలను శుభ్రం చేయించాలని పారిశుధ్య అధికారులను ఆదేశించారు. శిధిలావస్థకు చేరిన ఇళ్లను గుర్ ్తించి వాటిని డిమాలిష్ చేసేందుకు యజమానులకు నోటీసులు ఇవ్వాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. పట్టణ పరిధిలో ఎక్కడకూడా వేస్ట్ లేకుండా చర్యలు తీసుకోవాలని పారిశుధ్య అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా తాగునీరు పైపులయందు మురుగునీరు కలువకుండా చూడాలని, ప్రతిరోజు మంచినీటి నమూనాలను సేకరించి రికార్డ్సుయందు నమోదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ డిఈఈ తోట వెంకటరమణ, ఎఇ కోటేశ్వరరావు, టిపియస్ సునీత, పారిశుధ్య అధికారులు షేక్ ఇస్మాయిల్, ఎ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# బాపట్ల జిల్లా వార్త



● వేమూరు ● రేపల్లె ● బాపట్ల ● పర్చూరు ● అద్దంకి ● చీరాల

# పంట నమోదు తప్పని సరిగా చేయించుకోవాలి

**పొన్నూరు, అక్టోబరు 14,ప్రభాతవార్త:** పంట నమోదు చేయించుకొన్న రైతులందరూ తప్పనిసరిగా రైతు భరోసా కేంద్రం వద్ద వేలిముద్ర వేయించుకోవాలని మండల పరిషత్ అధ్యక్షురాలు భవనం పద్మలీల సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన వ్యవసాయ సలహా మండలి




మాట్లాడుతున్న వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ లంకపోతు పిచ్చిరెడ్డి తదితరులు

సమావేశంలో ఆమె మాట్లాడారు. వేలిముద్రలు వేసిన రైతులకు మాత్రమే ప్రభుత్వ ప్రయోజనాలు అందుతాయన్నారు. గ్రామంలో అందుబాటులో లేని రైతులందరూ ఓటిపి పద్ధతి ద్వారానైనా ఈకెవైసీ చేయించుకోవాలన్నారు. గ్రామస్థాయిలో రైతులకు తెలిసేలా వ్యవసాయాధికారులు చైతన్యం తేవాలన్నారు. మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ లంకపోతు పిచ్చిరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ సున్న వడ్డీ పంట రుణాలు పథకంలో లబ్ధి పొందగోరే రైతులు గత ఖరీప్‌లో లక్షరూపాయలు లోపు రుణం తీసుకొని సంవత్సరంలోపు చెల్లించిన వారికి ప్రభుత్వం వడ్డీ రాయితీ కింద డబ్బును జమ చేస్తుందన్నారు. అర్హత కలిగినవారందరూ బ్యాంకు అధికారులను సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ బొద్దులూరి రంగారావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి భవనం మారుతీ శేషమాంబ, మండల వ్యవసాయాధికారి దేగల వెంకట్రామయ్య, పశుసంవర్ధకశాఖ విఎఎస్ శైలజారాణి, బి.వెంకటరమణ, వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు పాల్గొన్నారు.

# పట్టపగలు కూడా వెలుగుతున్న వీధిలైట్లు

**- పట్టించుకోని మునిసిపల్ అధికారులు**

**పొన్నూరు, అక్టోబరు 14,ప్రభాతవార్త:** విద్యుత్‌ను ఆదా చేయండి....యల్ఈడి బల్బులు వాడండి...విద్యుత్ కొరతను నివారించండి అని చెప్పే పాలకుల మాటలు, అధికారుల మాటలను ప్రభుత్వంలోని కిందిస్థాయి సిబ్బంది పట్టించుకోవడంలేదనడానికి డీవీసి కాలనీలో పట్టపగలు వెలుగుతున్న లైట్లు నిదర్శనంగా కనబడుతున్నాయి. డీవీసి కాలనీలో ఎస్సీ,బీసీలు నివాసం ఉండే ప్రాంతంలో వీధి లైట్లు గత రెండు రోజుల నుంచి వెలుగుతున్నాయని అక్కడి ప్రజానీకం చెప్తున్నారు. విద్యుత్‌ను ఆదా చేయాలని ఉన్నతాధికారులు చెప్తుంటే వారి మాటలను కిందిస్థాయి అధికారులు పట్టించుకోకపోవడంతో చెప్పేది ఒకటి చేసేది ఒకటి అన్న రీతిగా ఉందని కాలనీవాసులు చెప్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధిలైట్ల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.



# ఎల్ఐసి ఏజంట్ల సమస్యలు పరిష్కరించాలి

**పొన్నూరు, అక్టోబరు 14,ప్రభాతవార్త:** లైఫ్ ఇన్సూరెన్సు కార్పోరేషన్ ఆఫ్ ఇండియా ఏజంట్ల డిమాండ్లను సత్వరమే పరిష్కరించాలని ఏజంట్ల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పలు డిమాండ్ల సాధనకు ఏజంట్లు చేస్తున్న సమ్మె శుక్రవారం ముగిసింది. జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు నాలుగు రోజులు సమ్మె చేశారు. పాలసీదారులకు తగు న్యాయం చేసే విధంగా నిబంధనలు



సడలించాలన్నారు. పాలసీపై జీఎస్టీ తొలగించాలన్నారు. బోనస్‌లు పెంచాలన్నారు. ఈ సందర్భంగా స్థానిక యల్ఐసి కార్యాలయం ముందు బైఠాయించి సమ్మె చేశారు. ఈ కార్యక్రమంలో చేగొండి అంకయ్య, బోడపాటి చంద్రశేఖర్, ఎక్కల దత్తాత్రేయులు, వెలగా సత్యనారాయణ, మర్రెడ్డి సురేందర్‌రెడ్డి, రవీంద్ర, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల నమోదు పారదర్శకంగా ఉండాలి

**పొన్నూరు, అక్టోబరు 14,ప్రభాతవార్త:** ఓటర్ల నమోదు ప్రక్రియ పాదర్శకంగా ఉండే విధంగా చూడాలని కోరుతూ టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు బండ్లమూడి బాబూరావు, వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మాదల వెంకటేశ్వరరావు తహశీల్దార్ ఎస్.శ్రీకాంత్ కేదార్నాధ్‌కు వినతిపత్రం అందజేశారు. అర్హత ఉన్న ఓట్లను తొలగించి కొత్తగా నమోదు చేసుకొన్న ఓటు దరఖాస్తులను విచారణ జరపకుండా ఆధార రహితంగా తిరస్కరిస్తున్నారని అర్జీలో పేరొ ్కన్నారు. బూత్ లెవల్ అధికారులు వారి ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తూ పారదర్శకతకు తిలోదకాలు ఇస్తున్నట్లు వారు చెప్పారు. మండల పరిధిలోని సీతారామపురం గ్రామ పరిధిలోని బూత్ నెం.243లో కాంద్రు వినోద్‌కుమార్, కొడాలి శ్రావణి, మన్నెం దేవీ వాసంతి అనువారు ఓటరుగా నమోదు అయి వున్నారు. అయితే వారి




ఓట్లను తొలగించేందుకు నోటీసులో తేదీ నమోదు చేయకుండా 18.12.2021 మధ్యాహ్నాం 12గంటలకు పొన్నూరు మండలంలోని సీతారామపురం గ్రామ సచివాలయానికి సాక్షాదారాలతో విచారణకు హాజరుకావాలని నోటీసు జారీ చేశారన్నారు. విచారణాధికారికి పూర్తిస్థాయిలో వివరణ ఇచ్చి బూత్ లెవల్ ఆఫీసర్ వద్ద నుండి ఎండార్సుమెంట్ తీసుకోవడం కూడా జరిగిందన్నారు. అయితే ఎన్నికల కమిషన్ 5-1-2022లో ప్రచురించిన ఓటర్ల జాబితాలో సదరు ఓటర్లను తొలగించినట్లు గుర్తించామన్నారు. సదరు విషయమై అక్రమంగా వీరి ఓట్ల తొలగింపుకు దరఖాస్తు చేసినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా స్టేట్ ఎలక్షన్ కమిషనర్‌కు, జిల్లా కలెక్టర్‌కు, పొన్నూరు నియోజకవర్గ ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసినప్పటికీ సదరు ఫిర్యాదుపై ఎటువంటి చట్టపరమైన చర్యలు తీసుకోలేదన్నారు. సదరు అర్జీదారులు ఓటు హక్కుకోసం ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకొన్నారు. దరఖాస్తు చేసుకొన్న అర్జీదారులను ఎటువంటి ప్రాథమిక విచారణ జరపకుండా ఓటువంటి సమాచారం ఇవ్వకుండా దరఖాస్తును తిరస్కరించినట్లు చెప్పారు. 2022 అక్టోబరు 8వ తేదీ రాత్రి 8.43కు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకుంటే కాంద్రు వినోద్‌కుమార్, జాస్తి సురేష్, దరఖాస్తును 2022 అక్టోబరు10వ తేదీన బూత్‌లెవల్ ఆఫీసర్ అపాయింటెండ్ చేశారు. 2022 అక్టోబరు 13వ తేదీ సాయంత్రం 4గంటలకు వాట్సాప్ నోటీస్ జారీ చేశారు. రాత్రి 8.43కు దరఖాస్తు చేస్తే అదేరోజు నోటీసు జారీ చేసినట్లు పేర్కొన్నారు. రాత్రి సమయంలో దరఖాస్తు చేసుకున్నటువంటి దరఖాస్తుకి అదే తేదీన నోటీసును జారీ చేసివున్నారు. అది ఎలా సాధ్యమని అర్జీలో పేర్కొన్నారు. ఇది ముమ్మాటికి సంబంధిత అధికారులు అధికారపార్టీ వారితో కుమ్మకై ఇతర పార్టీ సానుబూతిపరుల ఓట్ల తొలగించుటకు కుట్ర జరుగుతున్నట్లు తాము భావిస్తున్నామన్నారు. ఈ విషయంపై విచారణ జరిపి సంబంధిత బియల్వోలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాబూరావు, వెంకటేశ్వరరావు కోరారు.

# పందులు, ఆవులు, కుక్కలను నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలి

**-ప్రజారోగ్యానికి భంగం కలిగించవద్దు**

**తాడేపల్లి, అక్టోబరు 14, ప్రభాతవార్త :** నగర పాలక సంస్థ పరిధిలోని ఆయా వార్డులలోని రోడ్లపై విచ్చలవిడిగా సంచరిస్తున్న పందులు, ఆవులు, కుక్కల నిరోధించటానికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి ఆదేశించారు. మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి నగరపాలక సంస్థ



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో పందులు, ఆవులు, కుక్కలను బహిరంగంగా వార్డుల్లో తిరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. యధేచ్ఛగా ప్రధాన రహదారిపై పందులు, ఆవులు, కుక్కలు తిరగటం వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తున్నాయని, ఒక్కో సమయంలో వాహనదారులు ప్రమాదాలకులోనై గాయాలపాలవుతున్నారని తెలిపారు. పందుల, ఆవుల, కుక్కల యజమానులను పిలిపించి వాటిని ఇండ్లలో ఉంచుకోవాలని, రోడ్డుపైకి వదిలితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించాలని కోరారు. అవసరమైతే వాటిని బందెలదొడ్డికి తరలించాలన్నారు. ఖాళీ స్థలాలో సంచరించే పందుల వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతారని, వాటి యజమానులకు కౌన్సిలింగ్ ఇచ్చి నియంత్రించాలన్నారు. ఈ సమావేశంలో కమీషనర్ యు శారదాదేవి, డిఎస్పీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# వైద్యులు రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

**కొల్లిపర,అక్టోబరు 14 ప్రభాతవార్త:** వైద్యాధికారులు సమయపాలన పాటించి సకాలంలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు.శుక్రవారం మండల కేంద్రం కొల్లిపర సామాజిక ఆరోగ్య కేంద్రంలో అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది.ఈ సమావేశానికి హాజరైన శివకుమార్ ముందుగా



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

వైద్యశాలను పరిశీలించారు.రికార్డులను చూసారు..వైద్యశాలలో అసలు ఎంత మంది వైద్యులు పనిచేస్తున్నారు...అందులో డిప్యుటేషన్‌లో ఎందరు ఉన్నారు..అని వివరాలు రాబట్టారు.నిత్యం వైద్యశాలకు రోగులు ఎందరు వస్తున్నారు..వారందరికి సక్రమంగా వైద్యం అందుతుందా..మందులు సక్రమంగా అందుతున్నాయా..పాముకాటుకు..కుక్కకాటుకు మందులు ఉన్నాయా..మౌళిక సదుపాయాలుపై వైద్యశాల ఇన్‌చార్జి నాగరాజును..వైద్యాధికారులను అడిగారు.నిత్యం వైద్యశాలకు వచ్చే రోగుల పోన్ నెంబర్లు సిబ్బంది నమోదు చేయటంతో వెంటనే రోగులకు ఎమ్మెల్యే పోన్ చేసారు.వైద్యశాలలో మెరుగైన వైద్యం అందుతుందా..ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ నిత్యం వైద్యశాలలో వైద్యులు,సిబ్బంది అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలన్నారు.నాడు నేడు ద్వారా ప్రభుత్వ వైద్యశాలలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు.పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్నదే ముఖ్యమంత్రి ధ్యేయం అన్నారు.అనంతరం వైద్యశాల ప్రాంగణంలోనే రూ.8.50 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను స్థానిక నేతలు,అధికారులతో కలసి శివకుమార్ పరిశీలించారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పిల్లి రాధిక,ఎంపిపి భీమవరపు పద్మావతి,వైద్యశాలమ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కారుమూరు శ్రీనివాసరెడ్డి,ఎంపిడిఓ శ్రీనివాసులు,తహశీల్ధార్ నాంచారయ్య,జిల్లా డీసీహెచ్ఎస్ డాక్టర్ హనుమంతరావు,కార్యవర్గ సభ్యుడు బొమ్మారెడ్డి ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి రైతుకు ఈకెవైసి చేయించాలి

**నిజాంపట్నం, అక్టోబరు 14, ప్రభాతవార్త :** ప్రతి రైతుకు ఈకెవైసి తప్పనిసరిగా గడువులోగా చేయించాలని తహశీల్ధార్ ఎం శిరీష ఆదేశించారు. శుక్రవారం నిజాంపట్నం 1, 2 రైతు భరోసా



కేంద్రాలను ఆమె సందర్శించారు. ఆర్‌బికె సిబ్బందితో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అందించే సంక్షేమ ఫలాలు అందాలంటే ఈకెవైసి తప్పనిసరి అన్నారు. ఈకెవైసి పూర్తికాకుంటే రైతు వివరాలు ఈ క్రాప్‌లో నమోదుకావని, పంటకు గిట్టుబాటు ధర, వాతావరణ ఆధారిత భీమా, ఇన్‌పుట్ సబ్సీడీ, ఎరువుల సబ్సీడీ, విత్తనాలు, యంత్రాలు వంటి పథకాలు దూరం అవుతాయన్నారు. రైతులు దగ్గరలోని ఆర్‌బికెకు వెళ్ళి ఈకెవైసి చేయించుకోవాలన్నారు. ఆర్‌బికెలో జరుగుతున్న ఈకెవైసి ప్రక్రియ పరిశీలించారు.

# ఈ క్రాప్ బుకింగ్ వల్ల అనేక ప్రయోజనాలు

**నిజాంపట్నం, అక్టోబరు 14, ప్రభాతవార్త :**
ఈ క్రాప్ బుకింగ్ వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని జిల్లా వ్యసాయాధికారి అబ్దుల్ సత్తార్ అన్నారు. శుక్రవారం మండలంలోని బావాజీపాలెం అదవల గ్రామంలో రైతులకు



అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల సమయంలో కలిగే నష్టాలకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందుతుందన్నారు. అనేక ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని, రాయితీలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ నాగలక్ష్మి, వ్యవసాయశాఖ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నాదెండ్ల మండలంలో నేడు విద్యుత్ నిలిపివేసే ప్రాంతాలు

**నాదెండ్ల, అక్టోబరు14,ప్రభాతవార్త:** మండలంలోని సాతులూరు సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా నేడు ఉదయం 8గంటలనుండి మధ్యాహ్నాం 1 గంటవరకు మండలంలోని సాతులూరు, చందవరం, గొరిజవోలు, సంకురాత్రిపాడు, దొండపాడు, పొనుగుపాడు గ్రామముల పరిధిలోని గృహ, వాణిజ్య, చిన్న, భారీ పరిశ్రమలు, వ్యవసాయమునకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని, అదేవిధంగా నాదెండ్ల మండలంలోని 34-11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నాం 2గంటలవరకు మండలంలోని తూబాడు,జంగాలపల్లి, చిరుమామిళ్ల, గ్రామములకు గృహ, వాణిజ్య, చిన్న, బారీ పరిశ్రములు మరియు వ్యవసాయ మునకు విద్యుత్ సరఫరా నిలపివేయబడునని, వినియోగదారులు సహకరించవలసినదిగా విద్యుత్ డిఈఈ ఆర్ అశోక్‌కుమార్ శుక్రవారం తెలిపారు.

# వెయ్యి కుటుంబాలకు సంబంధించిన స్థలాలకు, ఇళ్ళకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలి

**నరసరావుపేట, అక్టోబర్ 14 ప్రభాతవార్త :** స్థానిక పెద్దచెరువులోని 715 సర్వే నెంబర్‌లో ఉన్న 25,26,31 వార్డుల్లో వెయ్యి కుటుంబాల వారికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గోపిరెడ్డికి పట్టణ వినియోగదారుల సంక్షేమ సంఘం నాయకులు కుంచాల స్వామి, దివ్యాంగుల రాష్ట్ర అధ్యక్షులు కర్నాటి కృష్ణమూర్తి వినతిపత్రం అందజేశారు. ఈ



**ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు కుంచాల స్వామి, కర్నాటి కృష్ణమూర్తి తదితరులు**

సందర్భంగా వారు ఎమ్మెల్యే గోపిరెడ్డికి సమస్యను వివరించారు. గత 20 సంవత్సరాల క్రితం ఉన్న రిజిస్ట్రేషన్లను ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పిస్తే నివాసితులు మున్సిపల్ ప్లాన్ అప్రూవల్ తెచ్చుకొని బ్యాంక్ రుణాలకు అర్హత పొందుతారన్నారు. మున్సిపల్ ప్లాన్ మంజూరు చేస్తే ఇంటిపన్నులు, నీటి పన్నులు, ఇతర పన్నులు లభించి మున్సిపాల్టికి ఆదాయం లభిస్తుందన్నారు. సర్వే నెంబర్ 715లో కొంత భాగమైన ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ప్రస్తుతం రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయన్నారు. అదే విధమైన పద్ధతి తమకు వర్తింపజేయాలని నాయకులు కుంచాల స్వామి, కర్నాటి కృష్ణమూర్తిలు విజ్ఞప్తి చేశారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ పల్నాడు సభ్యులు ఆధ్వర్యంలో కమీషనర్‌కు సన్మానం

**మాచర్ల టౌన్, అక్టోబర్ 14, ప్రభాతవార్త :** కష్టపడి పడిచేసే వారికి ఉన్నత పదవులు దక్కుతాయని పట్టణ మున్సిపల్ కమీషనరే నిదర్శమని లయన్స్ క్లబ్ ఆఫ్ పల్నాడు అధ్యక్షులు విడేల శ్రీనివాసరావు అన్నారు. మున్సిపల్ కమీషనర్‌గా ఈవి రమణబాబు పూర్తిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ పల్నాడు సభ్యులు శాలువా, పూల మాలతో సత్కరించారు.



అనంతరం ఆయన మాట్లాడుతూ రమణబాబు కష్టపడి పనిచేసేవారికి ఆదర్శనీయంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రదాన కార్యదర్శి సికిందర్, గవర్నర్ అడ్వైజర్ చుండూరు వెంకటేశ్వర్లు, పాస్ట్ జోన్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు, తిరివీధి వెంకట నాగేశ్వరరావు, మేడం నాగేశ్వరరావు, అర్జునరావు, నామేపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# అప్పుల బాధ తాళలేక రైతుమృతి

**వెల్దుర్తి క్రైం, అక్టోబర్ 14, ప్రభాతవార్త :** మండలంలోని శిరిగిరిపాడులో ఓ రైతు అప్పులబాధ తాళలేక పురుగుమందు తాగి మృతిచెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే శిరిగిరిపాడు గ్రామానికి చెందిన గుంటక వీరాంజనేయరెడ్డి (55) పత్తి పంట వేశాడు. పంట చేతికి రాకపోవటం, గత కొంత కాలంగా పంటలు సరిగా పండకపోవటంతో, ఎరువులకు, విత్తనాలకు తెచ్చిన అప్పులు పెరిగిపోయి అప్పుల వారు ఒత్తిడి చేయటంతో అప్పుల బాధ తాళలేక పురుగుమందు సేవించినట్లు తెలిపారు. భార్య బజారు నుంచి ఇంటికి వచ్చి చూడగా పురుగుమందు తాగి వాంతులు చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. బంధువులతో కలిసి ఆసుపత్రికి తీసుకెళ్ళే నేపథ్యంలో మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# భారత్ డెవలప్‌మెంట్ పార్టీ ఇన్‌ఛార్జిగా జాంబవరాజు

**మాచర్ల టౌన్, అక్టోబర్ 14, ప్రభాతవార్త :** ఎపి, తెలంగాణా రాష్ట్రాలకు భారత్ సమాజ్ డెవలప్ పార్టీ ఇన్‌ఛార్జిగా జెట్టిపాలెం వెంకటేష్ జాంబవరాజును అధికారికంగా నియమిస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షులు చింతాడ సూర్యం పేర్కొన్నారు. శుక్రవారం జాంబవరాజు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సూర్యం మాట్లాడుతూ వెంకటేష్ జాంబవరాజు కళాకారులు, పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం అనేక సంవత్సరాలుగా చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. అనేక పార్టీలున్నా కళాకారులు, పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి గురించి పట్టించుకున్న వారు లేరన్నారు. బిఎస్‌పి ఆధ్వర్యంలో కళాకారులు, పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి జరుగుతుందన్నారు. అందరి



మద్దతు బిఎస్‌పికి ఉందన్నారు. ఎపి, తెలంగాణా రాష్ట్రాలకు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కుర్ర రంగానాయక్‌ను నియమించినట్లు తెలిపారు. అనంతరం మ్యానిఫెస్టోను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కంభంపాటి దానం, ఆదిరాల సుందరరావు, ఆలేటి రత్నం, బూడిద లక్ష్మయ్య, జాన్, రమావత్ మాంగుబాయి, రమేష్ యాదవ్,గుండెబోయిన రమణమ్మ, జమ్మలమడక హనుమరాజు తదితరులున్నారు.

# స్కిల్ డెవలప్ ద్వారా ఉద్యోగ అవకాశాలు

**దుర్గి, అక్టోబర్ 14, ప్రభాతవార్త :** దళిత గిరిజన యువతకు ఎడ్యుకేషన్ ఎంప్లాయిమెంట్, ఎంటర్‌పేనర్‌షిప్, ఎంపర్‌మెంట్ స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ఉద్యోగ అశకాశాలు కల్పించటం అభినందనీయమని దళిత బహుజన



రిసోర్స్ సెంటర్ ఉమ్మడి గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అన్నారు. శుక్రవారం నర్సరావుపేట కలెక్టరేట్‌లో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్పందన మీటింగ్ హాలులో జరిగిన దళిత సాధికారత కరపత్ర ఆవిష్కరణలో ఆయన పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, డియర్‌డిఎ పీడి బాలునాయక్, సోషల్ వెల్ఫేర్ డిడి ఓబులనాయుడు, జిల్లా డెవలప్‌మెంట్ అధికారి శ్రీమతి మహాలక్ష్మీతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిన్నప్ప మాట్లాడుతూ దళిత బహుజన రిసోర్స్ సెంటర్ల ద్వారా చేస్తున్న విద్య, ఉపాధి, ఆరోగ్యం, రైతులు, మహిళలు, యువతి, యువకులు మహిళా సాధికారత కోసం సంక్షేమం, అభివృద్ధి, రక్షణా చట్టాలపై చేస్తున్న అవగాహన కార్యక్రమాలపై హర్షణీయమన్నారు. ప్రతి నెల 14వ తేదీన దళిత గిరిజన యువతి, యువకులు ఆర్థికాభివద్ధి సాధన కోసం చేపడుతున్న నవోదయ కార్యక్రమాన్ని నిరుద్యోగ యువతి, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన రిసోర్స్‌సెంటర్ జిల్లా కమిటి ప్రతినిధులు మేడే వెంకటరమణ, గడ్డిపర్తి కోటిరత్నం, వడ్డెమధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# రాజగోపుర నిర్మాణం స్థల పరిశీలన

**దుర్గి, అక్టోబర్ 14, ప్రభాతవార్త :** అడిగొప్పల శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మీఅమ్మవారి దేవస్థానం నందు రాజగోపుర నిర్మాణపు స్థలాన్ని శుక్రవారం ఆంధ్రప్రదేశ్ దేవాదాయ,ధర్మదాయశాఖ తపతి మల్లె పరమేశ్వరప్ప పరిశీలించారు. దేవస్థానం నందు చేపట్టనున్న అభివృద్ధి పనుల్లో భాగంగా



మాస్టర్ ప్లాన్ రాజగోపుర నిర్మాణపు ప్లాన్‌ను మాచర్ల శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని కలసి పరిశీలించారు. చేపట్టనున్న అభివృద్ధి పనులపై చర్చించారు. ఆయన వెంట అమ్మవారి దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీగిరిరాజు నరసింహబాబు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

## పల్నాడు జిల్లా వార్త



పెదకూరపాడు, గురజాల , మాచర్ల , చిలకలూరిపేట , నరసరావుపేట, వినుకొండ, సత్తెనపల్లి,

# నరసరావుపేట చరిత్రలో జెఎన్‌టియు మైలురాయి

**నరసరావుపేట, అక్టోబర్ 14 ప్రభాతవార్త :** నరసరావుపేట చరిత్రలో జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల మైలురాయి వంటిదని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కాకాని గ్రామం వద్ద జెఎన్‌టియు కళాశాలలో బిటెక్ మొదటి సంవత్సరం తరగతులను కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎడ్యుకేషన్ కౌన్సిల్ ఛైర్మన్ హేమచంద్రారెడ్డి, ఎం.పి.శ్రీకృష్ణదేవరాయలుతో కలిసి ఎమ్మెల్యే గోపిరెడ్డి



**: జెఎన్‌టియు కళాశాలలో నూతన భవనాలను ప్రారంభిస్తున్న ఎం.పి.లావు, ఎమ్మెల్యే గోపిరెడ్డి, కలెక్టర్ శివశంకర్, జెఎన్‌టియు ఉన్నతాధికారులు**

ప్రారంభించారు. రూ.9.2 కోట్లతో నిర్మించిన అకడమిక్ బ్లాక్-1 పూర్తి కావచ్చిందన్నారు. దివంగత సిఎం వై.ఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో కళాశాలను మంజూరు చేశారని గుర్తు చేశారు. 85.94 ఎకరాల సువిశాల భూమిని గుర్తించి కళాశాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. గత టిడిపి ప్రభుత్వం యూనివర్శిటీ కళాశాలను పట్టించుకోలేదన్నారు. సిఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 2020 ఆగస్టు 17న వర్చువల్ విధానంలో రూ.150 కోట్లతో నిర్మాణ పనులను ప్రారంభించారని తెలియజేశారు. అప్పటి నుండి పనులు జరుగుతున్నాయన్నారు. రూ.10 కోట్లతో ప్రహరీ నిర్మాణం పూర్తి చేశామన్నారు. తొలి విడతలో రెండు అకడమిక్ బ్లాక్‌లు, ఒక అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌ను రూ.30 కోట్లను నిర్మిస్తున్నామన్నారు. బాల బాలికల కోసం రూ.64 కోట్లతో నాలుగు హాస్టల్స్‌ను రెండు వేల మందికి ఏర్పాటు చేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో కళాశాలను యూనివర్శిటీగా మార్చేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే గోపిరెడ్డి వివరించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, యూనివర్శిటీ అధికారులు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

# కాకానిలో పర్యటించిన ఎం.పి.లావు, ఎమ్మెల్యే గోపిరెడ్డి

**నరసరావుపేట, అక్టోబర్ 14 ప్రభాతవార్త :** మండలంలోని కాకాని గ్రామంలో శుక్రవారం ఎం.పి.లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిలు పర్యటించారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను వారు సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థినీ విద్యార్థులు ఇంగ్లీష్ భాషలో మాట్లాడటాన్ని వారు అభినందించారు. విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. అదే విధంగా గ్రామంలో పర్యటించి వారికి అందుతున్నటువంటి వివిధ పథకాల గురించి ఆరా తీశారు. అనంతరం ఎం.పి.లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే గోపిరెడ్డిలు మాట్లాడుతూ ఆడపిల్లలు బాగా చదువుకోవాలని, ఆడపిల్ల చదువు ఇంటికి వెలుగు అని తెలిపారు. పదవ తరగతితో చదువును నిలిపి



వేయవద్దన్నారు. ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడికల్, ట్రిపుల్ ఐటి వంటి కోర్సులను అబ్బాయిలతో పోటీగా చదువుకోవాలని సూచించారు. ఆడ పిల్లలు ఉన్నతంగా ఎదిగి పెద్ద పెద్ద ఉద్యోగాలు చేసి కుటుంబాలకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. గ్రామంలోని పాఠశాలలకు నాడు - నేడు పథకంలో మరో రూ.50 లక్షలను ప్రభుత్వం ఇస్తుందన్నారు. బ్లాక్ బోర్డులు, మౌలిక వసతులు అందించడంతో పాటు పుస్తకాలు, డ్రస్సులు, షూస్ అన్ని ఉచితంగా ప్రభుత్వం ఇస్తుందన్నారు. పిల్లలను చదివించినందుకు ప్రభుత్వం డబ్బులు ఇస్తుందన్నారు. ట్రిపుల్ ఐటి వంటి చదువులతో రూపాయి ఖర్చు లేకుండా అద్భుతమైన భవిష్యత్తును అందుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రసాద్, ఎంపిపి మూరబోయిన సుబ్బాయమ్మ - శ్రీనివాసరావు, మాజీ ఎంపిపి తన్నీరు శ్రీనివాసరావు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# పట్టణంలో మినీమహానాడు సందడి...ఆకట్టుకుంటున్న ఫ్లెక్సీలు

**నరసరావుపేట, అక్టోబర్ 14 ప్రభాతవార్త :** తెలుగుదేశంపార్టీ పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో నిర్వహించే మినీమహానాడు ఏర్పాట్లకు సంబంధించి పార్టీ శ్రేణులు గత కొన్ని రోజులు ముందే సందడి చేస్తున్నాయి. భారీ వర్షాల సూచన ఉన్నప్పటికీ పార్టీ శ్రేణులు ఏర్పాట్లను ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రత్యేకంగా పట్టణంలోనూ, మినీమహానాడు జరిగే స్థలం వద్ద ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు ఆకట్టుకుంటున్నాయి. మూడేళ్ళ చిన్నారి శిఖర పేరుతోనూ పలు ఫ్లెక్సీలు వెలిశాయి. తమ తరం భవిష్యత్తు కోసం నిర్వహించే మినీమహానాడు కార్యక్రమానికి నేను వెళ్తున్నా మీరు వస్తున్నారా అంటూ ఆసక్తికరంగా, ఆకర్షణీయంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

# మహానాడుకు భారీగా తరలిరావాలి

**నరసరావుపేట, అక్టోబర్ 14 ప్రభాతవార్త :** నరసరావుపేట పట్టణ శివారులో నిర్వహిస్తున్న మినీమహానాడుకు భారీ సంఖ్యలో తరలిరావాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు విజ్ఞప్తి చేశారు. మహానాడు వేదికను, పార్కింగ్ సౌకర్యాలను శుక్రవారం నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ అరవింద్‌బాబు మాట్లాడుతూ రొంపిచర్ల మండలంలోని గ్రామాలతో పాటు నరసరావుపేట మండలంలోని పలు



గ్రామాలలో, వార్డులలో మినీమహానాడును విజయవంతం చేయాలని ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో జరిగే మినీమహానాడు తెలుగుదేశంపార్టీకి పండుగ వంటిదన్నారు. ఆయా గ్రామాల నాయకులు పార్టీ శ్రేణులను తరలించేందుకు తగిన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని డాక్టర్ అరవింద్‌బాబు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొల్లి బ్రహ్మయ్య, వేములపల్లి వెంకటనరసయ్య, కడియాల రమేష్, వాసిరెడ్డి రవి, కుమ్మెత కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌ఐసి ఏజెంట్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ టిడిపి డిమాండ్

**నరసరావుపేట, అక్టోబర్ 14 ప్రభాతవార్త :** ఎల్‌ఐసి ఏజెంట్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎల్‌ఐసి కార్యాలయం ఎదుట



**ఎల్‌ఐసి ఏజెంట్లకు మద్దతు తెలుపుతున్న డాక్టర్ అరవింద్‌బాబు**

నిర్వహిస్తున్న ఏజెంట్ల ఆందోళన కార్యక్రమానికి డాక్టర్ అరవింద్‌బాబు సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెంట్లు పాలసీదారులకు న్యాయం జరగాలని పోరాటం చేయడం అభినందనీయమన్నారు. పాలసీదారుల రుణాలపై వడ్డీ రేట్ల తగ్గింపు, పాలసీలపై జిఎస్‌టి ఎత్తివేత, ఏజెంట్ల ప్రొఫెషనల్ ట్యాక్స్ రద్దు తక్షణమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జాన్‌విక్టర్, రమేష్, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, మార్కండేయులు, సుబ్బారావు, మోహనకృష్ణారెడ్డి, బాబావలి తదితరులు పాల్గొన్నారు.

# పట్టణంలో గడప-గడపకు మన ప్రభుత్వం

**వినుకొండ, అక్టోబర్14, ప్రభాతవార్త:** సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలన సాగుతుందని ఎమెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. గడప-గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 1వ వార్డు సచివాలయ పరిధిలో



శుక్రవారం పర్యటించారు. వార్డులోని ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వినుకొండ పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. వైకాపా ప్రజలకు ఇచ్చిన అన్ని వాగ్ధానాలను మూడేన్నరేళ్ళ పాలనలోనే నెరవేర్చామని తెలిపారు. వైకాపా ప్రజారంజక పాలన ఓర్వలేని ప్రతిపక్ష పార్టీలు అనవసరపు రాద్ధాంతాలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో పట్టణ వైకాపా నాయకులు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

# ఐటిఐ ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ

**వినుకొండ, అక్టోబర్14, ప్రభాతవార్త:** స్థానిక విఠంరాజపల్లి సమీపంలోని శ్రీ బాలాజీ ఐటిఐ కాలేజీ నందు నాల్గవ విడత కౌన్సిలింగ్‌లో భాగంగా రెండేళ్ళ ఐటిఐ కోరు్స ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ షేక్ ఇమ్రాన్ తెలిపారు. ఆసక్తి గల పదో తరగతి పూర్తయిన విద్యార్థులు మార్కులిస్టు, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్‌పోటోలు అప్లికేషన్‌కు జతపర్చి ఈనెల 18వ తేదిలోపు కాలేజీలో అందజేయాలన్నారు. ఐటిఐ పూర్తయిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. వివరాలకు సెల్: 9440542030, 9703013335, 8341821710 సంప్రదించగలని తెలిపారు.

# విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

**వినుకొండ, అక్టోబర్14, ప్రభాతవార్త:** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ దస్తగిరి షకీలా అన్నారు. కర్నూలులో జరిగిన 5వ ఇంటర్నేషనల్ ఏపీ స్టేట్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక నిర్మలా ఆంగ్ల పాఠశాలకు చెందిన విద్యార్థులు బి.ఎల్ మహేశ్వర్‌రెడ్డి,



ఎన్. యశ్వంత్‌లు ప్రతిభ కనబర్చి ప్రథమ బహుమతి సాధించారు. శుక్రవారం ఈ మేరకు విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కౌన్సిలర్లు షకీలా, బాషా హాజరై విజేతలైన విద్యార్థులకు షీల్డ్, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సిస్టర్ రాణి గోవిందు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# పెదకూరపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బదిలీ

**పెదకూరపాడు, జూలై 14 ప్రభాతవార్త :** మండలంలోని 75 తాళ్ళూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గీతాకళ్యాణ్ బదిలీ అయ్యారు. ఈయన అమరావతి సిహెచ్‌సి కు బదిలీ అయ్యారు. వారి స్థానంలో డాక్టర్ ఉడుముల వెలుగొండారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తానని తెలియజేశారు.



# గ్రామంలో పందుల స్వైర విహారం

**- పలు వ్యాధులు వ్యాప్తి చెందుతాయని ఆందోళనలో ప్రజలు**

**పెదకూరపాడు, జూలై 14 ప్రభాతవార్త :** పెదకూరపాడు గ్రామంలో విపరీతంగా పందుల స్వైర విహారం చేస్తూ గ్రామంలో పలు రకాల అంటు వ్యాధులకు కారణంగా నిలుస్తున్నాయి. గ్రామంలో ప్రజలు పంచాయితీ అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ పందుల పెంపకం దారులకు నోటీసులు ఇచ్చి సరిపెట్టుకుంటున్నారే తప్ప సరైన చర్యలు తీసుకోవడం లేదని ఒక వైపు వర్షాలు మరో వైపు మురుగు ఉండడంతో పందులు అధికంగా తిరుగుతూ వివిధ రకాల వ్యాధులకు కారణాలుగా నిలుస్తున్నాయని, సీజనల్ వ్యాధులపై పంచాయితీ అధికారులు, ఆరోగ్య సిబ్బంది తగు సూచనలు, సలహాలు, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# దళిత వాడలో చేరిన వరద నీరు..

**గురజాల, అక్టోబరు14, ప్రభాతవార్త,** మండలములోని శుక్రవారం తెల్లవారు జామున పడిన వానలతో దైద గ్రామంలోని దళిత కాలనిలో వరద నీరు చేరి కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఎప్పుడు వర్షం పడిన ఈ కాలనీలో వరదనీరు,మరోప్రక్క మురుగు నీరు ప్రవహించడం తో బైటకు రావాలంటే ఇబ్బంది పడక తప్పదూ.ప్రక్కన ఉన్న తేలుకుట్ల



**ఏస్సీ కాలనీ లో చేరిన వరద నీరు**


గ్రామంలో నీరు కూడా ఈ ప్రాంతంలో ప్రవహించడంతో నీటి తీవ్రత ఎక్కువగా చేరి వాగు వైపు ఉన్న కుటుంబాలు ఎటు రాలేని పరిస్థితి.వానలు ఎక్కువ పడినప్పుడు రెండు గ్రామాలైన దైద-తేలుకుట్ల మధ్య రోడ్డు పై నీరు చేరి రాక పోకలకు అంతరాయం ఏర్పడిన సందర్భాలుఉనా్నయి.మురుగు నీరు చేరి అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఈ గ్రామాలలోఎక్కువగానే ఉన్నాయి.ప్రభుత్వాలు మారిన రెండు గ్రామాల మధ్య రోడ్డు పరిస్థితిఅధ్వాన్నంగా ఉన్న పరిష్కారం కాని పరిస్థితి.ప్రక్క గ్రామం తేలుకుట్ల గ్రామంలో నీరు కూడా దైద ఎస్సీ కాలనీ లోకి రావడంతో మరి ఎక్కువ నీరు పోయేందుకురెండు గ్రామాల మధ్య కల్వర్టు ఎర్పాటు చేసినా చివరికి అది పూడిపోయి మురికి నీరు,వర్షపు నీరు చెరువు లాగ అక్కడే నీరు నిల్వ ఉండటం తద్వారా అ నీరు దళిత వాడ లోకి చేరి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.రెండు గ్రామాలలో మురుగు నీరు,వరద నీరు ఏ గ్రామంలో నీరు అ గ్రామంలో ప్రవహించేవిధంగా రోడ్డు ఇరువైపులా సైడు కాలువలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఎస్సీ కాలనీ వాసులు కోరుతున్నారు.

# రాష్ట్ర ప్రజల కోసమే మినీమహానాడు సభలు

**నకరికల్లు, అక్టోబర్ 14 ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ప్రజల కోసమే మినీమహానాడు సభలను తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు, మాజీ ఎంపిపి నాగోతు శౌరయ్య అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో మాట్లాడారు. మొట్టమొదటిసారిగా పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో మినీమహానాడు జరుగుతుందన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడుతో పాటు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎం.పి.లు, ఎమ్మెల్సీలు ఈ కార్యక్రమానికి హాజరౌతారని తెలిపారు. ఈ నెల 19న జరిగే మినీమహానాడుకు సంబంధించి భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో ఉన్న పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. లక్షల సంఖ్యలో మినీమహానాడుకు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ప్రతి గ్రామం నుండి, పట్టణంలోని వార్డుల నుండి అన్నివర్గాల ప్రజలు మినీమహానాడుకు తరలిరావాలని కోరారు. రాష్ట్రంలో జరుగుతున్న పాలన ప్రజలకు వ్యతిరేకంగా ఉందన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని అరెస్ట్ చేయడం శోచనీయమన్నారు. పార్టీ నాయకులు నరేంద్ర వంటి వారిని అరెస్ట్ చేసి ఇష్టానుసారంగా ఆయనను గాయపరిచారన్నారు. సిఐడి అధికారులు ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరిస్తున్నారన్నారు. అదే విధంగా కస్టడీకి తీసుకొని ఆయనను హింసించడాన్ని ఖండించారు. ప్రభుత్వ తీరు అత్యంత దారుణంగా ఉందన్నారు. అధికారం ఎల్లప్పుడు ఒకరికి శాశ్వితం కాదన్నారు. పోలీసులతో పాటు సిఐడి అధికారులు ఖచ్చితంగా గుర్తు పెట్టుకోవాలని, అక్రమ అరెస్ట్‌లు దుర్మార్గమని ఈ సందర్భంగా నాగోతు శౌరయ్య అన్నారు.

# భూ సర్వే పై అధికారులతో చర్చించిన ఆర్‌డివో

**యద్లపాడు, అక్టోబర్ 14, ప్రభాతవార్త :**
స్దానిక తహశీల్దార్ కార్యాలయంలో వైయస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూ రక్ష పథకంలో భాగంగా జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను డివిజనల్ అర్‌డివో ఎమ్ శేషిరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ప్రస్తుతం కారుచోల, మైదవోలు గ్రామాలకు సంబంధించి డిఎల్ఆర్ పనులు సక్రమంగా జరుగుతున్నదా లేదా అనే విషయాలను పరిశీలించి అనంతరం జాలాది మరియు ఇతర గ్రామాలలో జరుగుతున్న పరిశీలన కార్యక్రమాల డేటాను పరిశీలించారు. పనులలో వేగం పెంచాలని అధికారులను అదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగమల్లేశ్వరరావు, అర్ఐ అనురాధ, సర్వేయర్ ఎల్ రాంబాబు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



# తెదెపా న్యాయ విభాగ ఉపాధ్యక్షుడుగా జాన్

**యద్లపాడు, అక్టోబర్ 14, ప్రభాతవార్త :** మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన న్యాయవాధి పుల్లగూర శామ్యూల్ జాన్ తెలుగు దేశం పార్టీ న్యాయ విభాగ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడుగా నియామక పత్రం అందుకోవటం జరిగిందని అయన ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. పార్టీ కార్యాలయంలో న్యాయ విభాగ సభ్యత్వ ప్రతిజ్ఞ నిర్వహించి బాధ్యతలు చేపట్టటం జరిగిందని, అనంతరం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబును కలసి అభినందనలు తెలపటం జరిగిందన్నారు. తనపై నమ్మకం ఉంచి పార్టీ న్యాయ విభాగ సభ్యత్వం అందించినందుకు పార్టీకి తన వంతు సహాయ సహకారాలు అందించుతానని తెలిపారు. న్యాయ విభాగ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడుగా ఎంపికైన పుల్లగూర శామ్యూల్ జాన్‌ను పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.




# మిర్చి రైతులను ప్రభుత్వం అదుకోవాలి

**: పల్నాడు జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు వీరారెడ్డి**

**యద్లపాడు, అక్టోబర్ 14, ప్రభాతవార్త :**
గత పది రోజుల నుండి మండలంలో ఎడతెరపి లేకుండా పడుతున్న భారీ వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ప్రభుత్వం వెంటనే దెబ్బతిన్న పంటలను గుర్తించి రైతులను అదుకోవాలని డిమాండ్ చేస్తున్నామని పల్నాడు జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు మద్దూరి వీరారెడ్డి పేర్కొన్నారు. మండ పరిధిలోని సొలస గ్రా వ ం ల ో ని మిర్చి పంటలను పరిశీలించగా వర్షాలకు పూర్తిగా దెబ్బతిని దేనికి పనికిరాని విధంగా ఉన్నాయని, ఇదేవధంగా జిల్లా పరిధిలోని అన్ని గ్రామాలలో ఉందని, ఇప్పటికే రైతులు యకరాకు 40నుండి50వేల పెట్టుబడులు పెట్టి ఉన్నారని, అదిలోనే అధిక వర్షాల బారిన పడిన పంట పూర్తిగా దెబ్బతినటంతో వారికి దిక్కుతోచని స్దితిలో ఉన్నారని, గత సంవత్సరం పంటలు పూర్తిగా దెబ్బతినటంతో నష్టాలను చవిచూడవల్సి వచ్చిందని, ప్రస్తుతం అదేపరిస్తితి కొనసాగుతుందని, వరుస నష్టాలతో రైతులు ఇబ్బందులు పడుతున్న తరుణంలో వెంటనే ప్రభుత్వం కలుగజేసుకొని రైతులకు తగు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు.



# లీగల్‌సెల్ ప్రమాణస్వీకారంలో పాల్గొన్న స్ధానిక లీగల్‌సెల్ నాయకులు

**చిలకలూరిపేటటౌన్, అక్టోబరు14, ప్రభాతవార్త:**
తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం టిడిపి లీగల్‌సెల్ ప్రమాణస్వీకారం జరిగింది. ఈ సందర్భంగా టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడను స్దానిక లీగల్‌సెల్ నాయకులు కలుసుకున్నారు. పార్టీ పటిష్టతకు కృషిచేయాలని లీగల్‌సెల్ నాయకులను చంద్రబాబు కోరారు. ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట టిడిపి లీగల్ విబాగానికి చెందిన న్యాయవాదులు ఈవూరి బ్రహ్మనందం, సయ్యద్ వహబ్, జివిహెచ్‌యస్ ప్రసాద్, వై శ్రీనివాసరావు, ఎ వెంకటేశ్వర్లు, జి శివరామకృష్ణ, మండవ వెంకట్రావు, బి కోటేశ్వరరావు, సాపా ఆదినారాయణ, గుంటు హరిబాబు, రాష్ట్ర లీగల్‌సెల్ ఉపాధ్యక్షుడు పుల్లగూరు శా య్యూమ్యాల్‌జాన్, సంగిశెట్టి శివకుమార్ పాల్గొన్నారు.



# పట్టణంలో జీరోవేస్ట్ క్లీన్ ఎపి కార్యక్రమం చేపట్టిన కమీషనర్

**చిలకలూరిపేట, అక్టోబరు14, ప్రభాతవార్త:**
పట్టణంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ఆదేశాలమేరకు మున్సిపల్ కమీషనర్ సిహెచ్ గోవిందరావు, మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని ఆధ్వర్యంలో పట్టణంలోని వార్డులలో వర్షపు నీరు నిల్వఉన్న నీటి తోట్లను పారిశుధ్య సిబ్బంది క్లీన్ ఎపి కార్యక్రమంలో బాగంగా శుక్రవారం పరిశీలించారు. ఆ తొట్లలో ఉన్న నీటిని తొలగించి వాటిలో ఆయిల్‌బాల్స్ వేశారు. అదేవిధంగా 12వ వార్డు పరిధిలో చర్చిపక్కన ఉన్న చెరువులో వర్షపునీరు, మురుగునీటితో నిండిపోవటంతో ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాగా శుక్రవారం మున్సిపల్ కమీషనర్ గోవిందరావు, పారిశుధ్య అధికారి ఇస్మాయిల్ దాన్ని సందర్శించి నీటి ఇంజన్లు ఎర్పాటుచేసి చెరువులో ఉన్న నీటిని బయటకు పంపించే ఎర్పాట్లు చేశారు. అదేవిధంగా మురుగు కాలువలలో పూడికలు తీయించడంతోపాటు కాలువలలో ఆయిల్‌బాల్స్‌ను పారిశుధ్య సిబ్బందిచేత వేయించారు.



# 10వ వార్డులో ప్రత్యేక శానిటేషన్

**చిలకలూరిపేట, అక్టోబరు14, ప్రభాతవార్త:** పట్టణంలోని 10వ వార్డులో శుక్రవారం వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి మున్సిపల్ పారిశుధ్య సిబ్బందిచే ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమం చేయించారు. వర్షాకాలం కారణంగా డెంగ్యూ, మలేరియాలాంటి వ్యాధులు రాకుండా పరిసరాలన్నింటిని శుభ్రంగా ఉండేందుకు మురుగు కాలువల లో పూడికలను, పిచ్చిచెట్లను, గడ్డిని, తొలగించే కార్యక్రమాన్ని పారిశుధ్య సిబ్బందిచే చేపట్టించారు. ఈ కార్యక్రమలో వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శి సల్మా, శానిటేషన్ మేస్త్రి ముస్తాఫా, సిబ్బంది పాల్గొన్నారు.



# రాష్ట్రంలో స్పిన్నింగ్ అండ్ టెక్స్‌టైల్ మిల్లులు తీవ్ర సంక్షోంభంలో ఉన్నాయి

**చిలకలూరిపేట, అక్టోబరు14, ప్రభాతవార్త:** రాష్ట్రంలో స్పిన్నింగ్, టెక్స్‌టైల్‌మిల్లులు తీవ్ర సంక్షోంభంలో ఉన్న కారణంగా నష్టాలలో నడుస్తున్నాయని సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ రంగారావు అన్నారు. శుక్రవారం పండరీపురంలో ఉన్న ప్రజాసంఘాల కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ చిలకలూరిపేటలో క్యాబినెట్ హోదా ఉన్న మంత్రి ఉన్నప్పటికి ఈ విషయంపై నోరు మెదపకపోవటం దురదృష్టకరం అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రాయితీలు ఇంతవరకూ స్పిన్నింగ్ మిల్లులకు అందలేదన్నారు.



**సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ నరసింగారావు**


రాష్ట్ర ప్రభుత్వం స్పిన్ని ంగ్, టెక్స్‌టైల్ పరిశ్రమల కోసం ప్రకటించిన రూ1400 కోట్లు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్‌చేశారు. డ్యూటీపేరుతో విద్యుత్ చార్జిని 6పెసలనుంచి రూపాయిలకు పెండటం అన్యాయమన్నారు. ఇది పరిశ్రమలకు మోయలేని భారం అయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలకు ఎంతో అభివృద్ధి జరిగేటట్టు చేస్తున్నట్లు చెప్పటం దారుణమన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతానికి 6 పంచదార ప్యాక్టరీలు, చిట్టివలస జ్యూట్‌మిల్లు, అనేక డెయిరీలు మూతపడ్డాయన్నారు. అవన్నీ ముఖ్యమంత్రికి రాష్ట్ర నాయకులకు కనిపించడంలేదా అని ఆయన ప్రశ్నించారు. ఇవిగాక స్పిన్నింగ్, కాటన్‌మిల్లులు కూడా మూతపడే దశలో ఉన్నాయని ఆయన ఈ సందర్బంగా వివరించారు. ప్రధానంగా కేం ద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని కాపాడే చర్యలు ఎమి తీసుకోకపోవటం దురదృష్ టకరమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 110 టెక్స్‌టైల్ మిల్లులు ఉన్నాయిన వీటిలో 70వేలమంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. ఒక్క పల్నాడు జిల్లాలోనే చిలకలూరిపేట పరిసర ప్రాంతాలలో 34 స్పిన్నింగ్ మిలు్లలు ఉన్నాయని వాటిలో 34వేలమంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వీటిపై అధారపడే పత్తి పండించే రైతులు అనేక వేలమంది ఉన్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలవలన రైతులతోపాటు పరిశ్రమలు కూడా అధ్వాన్నస్దితికి తయారయ్యాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి పరిశ్రమలను ఆదుకోవాలని ఆయన డిమాండ్‌చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే కార్మికులతో కలసి ఆందోళన చేయవలసి వస్తుందని హెచ్చరించారు. అంతేకాక జాతీయ రహదారులు దిగ్బంధనంకూడా చేపడతామని రంగారావు ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ రహ్మత్, జిల్లా కార్యదర్శి యస్ ఆంజనేయనాయక్, జిల్లా ఉపాధ్యక్షులు జి విజయకుమార్, సిఐటియు నాయకులు పోపూరి సుబ్బారావు, పేరుబోయిన వెంకటేశ్వర్లు, రైతు సంఘం అధ్యక్షుడు వై రాధాకృష్ణ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# ఆళ్ల కృష్ణారెడ్డి చిత్రపటానికి ఘననివాళి

**చిలకలూరిపేట, అక్టోబరు14, ప్రభాతవార్త:** పట్టణంలోని 9వ వార్డుకు చెందిన టిడిపి నాయకుడు ఆళ్ల కృష్ణారెడ్డి ఇటీవల మృతిచెందారు. కాగా ఆయన పెద్దకర్మను శుక్రవారం సిఆర్ కాలనీలో నిర్వహించారు. ఈ సందర్బంగా రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు, మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు వారి నివాసానికి వెళ్లి కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన కుమారుడు 9వ వార్డు టిడిపి అధ్యక్షుడు అయిన ఆళ్ల సీతారామిరెడ్డిని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ప్రత్తిపాటితోపాటు పార్టీ నాయకులు షేక్ కరిముల్లా, ఎలూరి తిరుపతయ్య, గుర్రం నాగపూర్ణచంద్రరావు, తన్నీరు పుల్లారావు, రాయి పద్మ, ఒంటిపులి వెంకట్, రాయి సుబ్బారావు, వార్డు పార్టీ నాయకులు పాల్గొని నివాళులు అర్పించారు.

# భూమి రీ సర్వేపనుల రికార్డుల పరిశీలన

**చిలకలూరిపేట, అక్టోబరు14, ప్రభాతవార్త:** తహసిల్దార్ కార్యాలయంలో భూసర్వే రికార్డులను శుక్రవారం



నరసరావుపేట ఆర్‌డిఒ శేషిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్బంగా సర్వేపనులకు సంబందించిన ఆన్ని రికార్డులను పరిశీలించి స్దానిక తహసిల్దార్ జి సుజాతకు తగు సూచనలు చేశారు. రికార్డులన్నింటిని, సర్వే పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆర్‌డిఒ ఆదేశించారు.

# 16న అవగాహన...లో ప్రకృతివైద్యం,ప్రకృతి జీవన విధానంపై ఆరోగ్యసభ

**గుంటూరు కల్చరల్, అక్టోబర్ 14, ప్రభాతవార్త :** అవగాహన సంస్థ ప్రతిఆదివారం క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఆరోగ్య సభల్లో భాగంగా ఈ వారం ప్రకృతి వైద్యం,ప్రకృతి జీవనవిధానంపై సభ ఏరా ్పటు చేయబడిందని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు.అక్టోబర్ 16 ఆదివారం ఉదయం 11గంటలకు జరిగే ఆరోగ్యసభలో ఆయుష్ విభాగపు కో–ఆర్డినేటర్ డాక్టర్ ఉమాసుందరి,ప్రముఖ యోగ,ప్రకృతి వైద్యప్రచారకులు డాక్టర్ బి.ఎస్.కృష్ణవేణి ప్రధానవక్తలుగా పాల్గొంటారన్నారు.ఖర్చులేకుండా ఎవరికి వారే ఇంట్లో చేసుకునే అవకాశమున్న ప్రాచీన వైద ్యవిధానం,ప్రకృతి వైద్యం,జీవనవిదానం గురించి వివరంగా తెలియజేయడం జరుగుతుందన్నారు.కావున ఆరోగ్యాభిలాషులందరూ ఈ ఆరోగ్యసభకు హాజరు కావాలని సంస్థ విజ్ఞప్తి చేస్తుంది.

# 50శాతం రాయితీ ప్రకటించిన డిహెచ్‌ఎల్ ఎక్స్‌ప్రెస్ ఇండియా

**గుంటూరు విద్య, అక్టోబర్ 14, ప్రభాతవార్త :** ప్రపంచ అగ్రగామి ఇంటరే ్నషనల్ ఎక్ ్స ప్రెస్ సర్వీస్ ప్రొవైడర్ అయిన డిహెచ్‌ఎల్ ఎక్ ్సప్రెస్ మరోసారి పండుగ సంతోషాన్ని విస్తరింప చేస్తూ 50శాతం రాయితీని ప్రకటించింది.రిటైల్ కస్టమర్లు రెండు కిలోలకు పైబడి ఉండే అంతర్జాతీయ షిప్‌మెంట్లపై 50శాతం,లేదా అంతకుమించి తగ్గింపును పొందే అవకాశాన్ని అందిస్తుంది.ఈ ఆఫర్‌తో కష్టమర్లు తమ స్నేహితులు,కుటుంబసభ్యులతో అనుసంధానం కావాలన్నదే డిహెచ్‌ఎల్ లక్ష్యమని డిహెచ్‌ఎల్ ఎక్స్‌ప్రెస్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ (సేల్ ్స అండ్ మార్కెటింగ్) సందీప్ జునేజా పేర్కొన్నారు.

# మహిళా పోలీసు మృతిపై కేసు నమోదు

**గుంటూరు క్రైం, అక్టోబరు 14, ప్రభాతవార్త:** గ్రామ సచివాలయంలో మహిళా పోలీసుగా పనిచేస్తున్న దొప్పలపూడి మహాలక్ష్మి అనే యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటనపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... నగర శివారు ఏటుకూరు గ్రామానికి చెందిన ఈమె పొన్నూరు శివారు దండమూడిగ్రామ సచివాలయంలో మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తోంది. శుక్రవారం ఇంటి వద్ద తూలి కిందపడింది. విషయం గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటినవైద్యుని వద్దకు తీసుకువెళ్లగా పరీక్షించి మృతి చెందినట్లుగా నిర్థారించారు. మృతురాలి తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు సీఐ బత్తులశ్రీనివాసరావు తెలిపారు.

# జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో నేర సమీక్ష

**నరసరావుపేట, అక్టోబర్ 14 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లాలోని డిఎస్పీ, సి.ఐ.స్థాయి అధికారులతో ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ మిస్సింగ్ కేసులు, ప్రాపర్టీ, చోరీ కేసులు, చీటింగ్ కేసులు, రోడ్డు ప్రమాదాల కేసులు త్వరగా పూర్తి చేయాలన్నారు. పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించాలన్నారు. దొంగతనాల కేసుల్లో రికవరీ శాతం పెంచాలన్నారు. శాస్త్రీయ పద్ధతిలో నేరాలను దర్యాప్తు చేయాలన్నారు. సైబర్ నేరాలు, లోన్ యాప్ మోసాలపై ప్రత్యేక దృష్టి నిలపాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా ప్రతి పోలీస్ అధికారి తమ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫ్యాక్షన్ గ్రామాలను సందర్శించాలన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాల కట్టడికి నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలని ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ జి.బిందుమాధవ్, రామచంద్రరాజు, డిఎస్పీలు రవిచంద్ర, విజయభాస్కరరావు, జయరాంప్రసాద్, సి.ఐ.లు పాల్గొన్నారు.

# సర్పంచ్ అనే పేరు తప్ప పంచాయితీ ఖజానాలో చిల్లిగవ్వ ఉంచడం లేదు

**- గ్రామ స్వరాజ్యం, గ్రామ పంచాయితీలే దేశానికి పట్టుకొమ్మలంటే ఇలాగేనా ?**

**పెదకూరపాడు, జూలై 14 ప్రభాతవార్త :** గ్రామ పంచాయితీలలో నిధులు, పక్కదారి పట్టడంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదని, రోడ్లు, డ్రైయినేజీలు, త్రాగునీటి సరఫరా వంటి సమస్యలు, గ్రీన్ అంబాసిడర్లకు వేతనాల చెల్లింపు భారంగా మారిందని, సకాలంలో సమస్యలను పరిష్కరించలేక పోవడానికి కారణం పంచాయితీల్లో నిధులు లేవని, అందుకే ఏ పని చేపట్టలేకపోతున్నామని నియోజకవర్గంలోని సర్పంచ్‌లు గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వం మాత్రం గ్రామ సచివాలయ వ్యవస్థను చూసుకొని పక్కనపెట్టేసిందనే విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. గ్రామ పంచాయితీల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం ద్వారా విడుదల చేసిన నిధులు ప్రభుత్వం లాగేసుకుంటుందంటూ ఏ.పి.లోని పలు సర్పంచ్‌ల సంఘాలు ఆరోపిస్తు న్నాయి. ఈ విషయమై పలు పంచాయితీ సర్పంచ్ లు అధికారులకు వినతిపత్రాలు, విజ్ఞాపనలు ఇచ్చినప్పటికీ ఫలితం శూన్యం. గ్రామ స్వరాజ్యం, గ్రామ పంచాయితీలే దేశానికి పట్టుకొమ్మలు అంటూ పెద్ద పెద్ద మాటలు చెప్పే పాలకులు ఆచరణలో మాత్రం పంచాయితీ రాజ్ వ్యవస్థ మనుగడనే ప్రశ్నార్థకం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని పలు గ్రామాల సర్పంచ్‌లు ఆరోపిస్తున్నారు. గ్రామాలలో పారిశుధ్యం, త్రాగునీరు, రోడ్ల మరమ్మత్తుల వంటి అవసరాల కోసం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్ళించడంపై సర్పంచ్‌లు మండిపడుతున్నారు. స్పంచ్ అనే పేరు తప్ప పంచాయితీ ఖజానాలో చిల్లిగవ్వ ఉంచడం లేదని, పైగా పన్నుల రూపంలో పంచాయితీ ఖాతాలో జమవుతున్న నిధులను కూడా దారిమళ్ళిస్తున్నారని సర్పంచ్‌లు వాపోతున్నారు. ఇంతకాలం ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని ఎంతో ఓపికగా ఎదురు చూసినా ప్రభుత్వం నుండి స్పందన లేదని, గ్రామాలలో సమస్యలు తిష్టవేసుకు కూర్చున్నాయని, ఇప్పటికైనా తమ నిధులు తమకు కేటాయించకపోతే ప్రజలలో తిరిగే పరిస్థితి ఉండదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో పార్టీ సింబల్ తో పోటీ చేయకపోయినా పార్టీ సానుభూతిపరులే సర్పంచ్‌లుగా ఎన్నిక అవుతారనేది అందరికీ తెలిసిన విషయమే. వైకాపా కూడా రాష్ట్రంలో దాదాపు 90 శాతం పంచాయితీలు తమ పార్టీనే గెలుచుకున్నట్లు ప్రచారం చేస్తోంది. అటువంటి సర్పంచ్‌లు ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమవ్వడమంటే ఒకరకంగా అధికారపార్టీకి గట్టి దెబ్బే అని చెప్పుకోవాలి. సర్పంచ్ అంచే ఆయా గ్రామాలలో మంచి పట్టుకలిగి ఉంటారు. ఏ పార్టీ ఐనా సరే ఇటువంటి సెకండ్ క్యాడర్ లీడర్లను నిర్లక్ష్యం చేస్తే ఆ తరువాత భారీ మూల్యం చెల్లించుకున్న ఉదాహరణలు కోకొల్లలు. ఇప్పటికే సీపీఎస్ రద్దు అంశంలో ప్రభుత్వ ఉద్యోగుల ఆగ్రహానికి గురైన ప్రభుత్వం ఇప్పుడు సర్పంచ్‌లను కూడా దూరం చేసుకుంటే రానున్న ఎన్నికలలో కష్టాలు ఎదుర్కోక తప్పదనేది తేట తెల్లమౌతుంది.




**పంచాయితీ కార్యాలయం**

# పెద్దబొమ్మలాపురం వీఆర్ఏ పర్షపోగు దేవదానం మృతి

**పెద్దదోర్నాల, అక్టోబరు 14, ప్రభాతవార్త**
పెద్దదోర్నాల మండలం పెద్దబొమ్మలాపురం వీఆర్ఏ పర్షపోగు దేవదానం అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించి రెవెన్యూ శాఖలో ఉత్తమ సేవలందించి రెవెన్యూశాఖలో ఉత్తమ వీఆర్ఏగా పరశపోగు దేవదానం అధికారులు, ప్రజల మన్ననలు పొంది అందరివాడిగా మంచి పేరు తెచ్చుకున్నారు. దేవదానం మృతి సమాచారం తెలుసుకున్న పెద్దదోర్నాల మండలం తహశీల్దార్ వేణుగోపాల్‌రావు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఉప్పలపాటి భాస్కరరావు, సీనియర్ అసిస్టెంట్ వెలిదండ నాగేశ్వరరావు, పెద్ద బొమ్మలాపురం వీఆర్వోలు మోహన్‌రావు, పలుగుజ్జు ఆనందరావు, కాశిరావు, వీఆర్ఏల సంఘం జిల్లా నాయకులు పూర్ణకంటి యాకోబు, జెడ్డా ఆశీర్వాదం, దర్శనం దానం, కాశయ్య, వెంకటేశ్వర్లు, ప్రభుదాసు తదితరులు మృతుడు దేవదానం భౌతికకాయాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సమాధి మట్టి ఖర్చులకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాన్ని మృతుని కుటుంబ సభ్యులకు తహశీల్దార్ వేణుగోపాల్, ఆర్ఐ భాస్కరరావు, సీనియర్ అసిస్టెంట్ వెలిదండ నాగేశ్వరరావులు అందజేశారు.

# బోర్డు వారి అనుమతి మేరకే పొగాకు సాగు చేయాలి

**నాగులుప్పలపాడు, అక్టోబరు 14, ప్రభాతవార్త**
నాగులుప్పలపాడు మండలం ఒబన్నపాలెం గ్రామంలో పొగాకు రైతులకు పంట నియంత్రణ సదస్సు శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పొగాకు బోర్డు ఒంగోలు–2 వేలం నిర్వహణాధికారి కోవి రామకృష్ణ మాట్లాడుతూ అంతర్జాతీయంగా పొగాకు పంటకు డిమాండ్ తగ్గిన నేపధ్యంలో పంట తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. బోర్డు వారు అనుమతి ఇచ్చిన మేరకు మాత్రమే 4.75 ఎకరాల్లో పండించాలని ఎట్టి పరిస్థితుల్లో విస్తారంగా నాటడం, అధికంగా పండించడం చేయరాదని అన్నారు. కౌలు భూములు, అదె ్ద బ్యారన్లలో పొగాక సాగు లాభదాయకం కాదని కనుక సొంత భూమి సొంత బ్యారన్ ఉన్న వారు మాత్రమే పొగాకు పంట సాగు చేయుట లాభదాయకం అని అన్నారు. అనధికారి లీజులు చెల్లవు అని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంతో పొగాకు నారుమడులు చేపడితే నాణ్యమైన పొగాకు ఉత్పత్తి సాగు అవుతుందని చెప్పారు. అలా సాగు చేయడం వలన ట్రేలలో పొగాకు నారు 100శాతం మొలక రావడానికి అవకాశం ఉంటుందన్నారు. పొగాకు పంటకు ప్రత్యామ్నాయ పంటలు శనగ, కంది, మిరప వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు–2 వేలం నిర్వహణాధికారి కోవి రామకృష్ణ, ఐటీసీ ప్రతినిధి ప్రశాంత్ షెల్గే, పొగాకు బోర్డు సిబ్బంది, ఐటీసీ సిబ్బంది, రైతులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్దే ధ్యేయం

**నాగులుప్పలపాడు, అక్టోబరు 14, ప్రభాతవార్త**
గ్రామాల అభివృద్దే ద్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. శుక్రవారం నాగులుప్పలపాడు మండలం అమ్మన్నబ్రోలు గ్రామంలో ఎస్టీ యానాది సంఘం ట్రైలర్స్ కాలనీ, బీసీ కాలనీలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పాల్గొని ప్రతి గడపకు తిరుగుతూ అందరిని ఆప్యాయంగా పలకరిస్తూ ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. గ్రామస్తులు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబుకు పూలు చల్లుతూ ఘన స్వాగతం పలికారు. సంక్షేమ పథకాలకు సంబంధించి బుక్‌లెట్‌ను పంపిణీ చేశారు. 600గడపలను నేరుగా ఆయన సందర్శించి ప్రభుత్వం చేస్తున్న మేలులను మీ కుటుంబాలకు చేరాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ సంక్షేమం, అబివృద్ధి రెండు కళ్ళు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. నియోజకవర ్గంలో ఇప్పటి వరకు 29వేల గడపలను తాను స్వయంగా సందర్శించానని 98శాతం పైగా సంక్షేమ ఫలాలు ఆయా కుటుంబాలకు చేరాయని దీని ద్వారా ఆ కుటుంబాలు సంతృప్తిగా ఉన్నాయని అన్నారు. రాబోయే 2024 ఎన్నికల్లో మరోసారి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవ్వడం తధ్యమన్నారు. దీంతో పాటుగా సంతనూతలపాడు నియోజకవర్గంలో తిరిగి తాను శాసనసభ్యుడిగా మరో మారు గెలవడం ఖాయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పోలవరపు శ్రీమన్నారాయణ, వైసీపీ సీనియర్ నాయకులు కోయ హనుమయ్య, కాట్రగడ్డ శ్రీనివాసరావు, ఉన్నాం శ్రీనివాసరావు, సర్పంచ్ రవీనా కొండయ్య, ఆదయ్య, ఎస్‌కే అత్తి, త్రినాథ్‌రెడ్డి, ఎంపీటీసీ మున్నంగి వెంకటరావు, నల్లూరి రాజా, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# రేగులచెలక వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటకృష్ణపై అధికారుల విచారణ

**సీఎస్‌పురం, అక్టోబరు 14, ప్రభాతవార్త** మండలంలోని రేగులచెలక గ్రామ సచివాలయం వెల్ ్ఫర్ అసిస్టెంట్ తులబందుల వెంకటకృష్ణపై డిప్యూటీ డైరక్టర్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మీ నాయక్ శుక్రవారం విచారణ చేపట్టారు. రేగులచెలక వెల్ఫేర్ అసిస్టెంట్ తులబందుల వెంకటకృష్ణ ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్దిదారులకు అందించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని, అర్హులకు అన్యాయం చేస్తూ అడగిన వారిపై దౌర్జన్యం చేస్తున్నారని, ఇందులో భాగంగా గతంలో ఒకసారి ఓ వాలంటీర్‌పై చేయి చేసుకున్నాడని తాజాగా వైఎస్సార్ చేయూత లబ్దిదారుల ఎంపిక విషయంలోనూ అర్హులకు అన్యాయం చేశాడని ఇతనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలంటూ రేగులచలక ఎంపీటీసీ జాజుల తిరిపాలు, పలువురు గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై సోషల్ వెలే ్ఫర్ ఆఫీసర్ లక్ష్మీ నారాయక్ శుక్రవారం విచారణ చేపట్టారు. ఫిర్యాదు దారులను ఆరోపణ ఎదుర్కొంటున్న వ్యక్తిని స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి పిలిపించి విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ఈశ్వరమ్మ, ఏఎస్‌డబ్లూ ్య రాజేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ భూమిరెడ్డి, ప్రభంజన వెంకటేశ్వరరెడ్డి, రేగులచెలక ఎంపీటీసీ జాజుల తిరిపాలు, అంబవరం మాజీ సర్పంచ్ అద్దంకి రమణయ్య తదితరులు ఉన్నారు.

